# విశాల భారతి

తెలుగు దినపత్రిక

14-04-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 103




## నల్లగొండలో మిల్లర్ల అరాచకం

- రైతులను నిలువునా దోచుకుంటున్న రైస్ మిల్లర్లు
- వారం రోజుల్లో క్వింటాల్‌కు రూ.400 తగ్గించి మోసం
- కొనుగోలు కేంద్రాలు తెరవక రైతులకు అవస్థలు
- తేమ పేరుతో తక్కువ ధరకే వడ్ల కొనుగోలు
- అకాల వర్షా ల భయంతో రైతుల కంగారు
- మిల్లర్ల దందాపై అధికారుల నిర్లక్ష్యం

04



# అడుగు అడుగున రాజకీయం

ఇద్దరు నేతల టార్గెట్ మళ్లీ అధికారమే

### వచ్చే ఏడాది నుండి కేటీఆర్ పాదయాత్ర | 2027 చివరి నుండి జగన్ పాదయాత్ర

- ప్రజా క్షేత్రంలోనే ప్రభుత్వాల వైఫల్యాల గుర్తింపు
- వైఎస్సార్, బాబు బాటలోనే వారసుల యాత్రలు
- అధికార పార్టీలు వీరిని ఎలా అడ్డుకుంటాయో చూడాలి

02

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఇప్పుడు 'పాదయాత్ర' అనే రెండక్షరాల మంత్రం మళ్లీ మార్మోగుతోంది. ఒకప్పుడు దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మండుటెండల్లో చేపట్టిన 'ప్రజాప్రస్థానం' ఏ స్థాయిలో ప్రభంజనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. ఆ యాత్ర కేవలం ఒక నడకగా కాకుండా, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఒక రహదారిగా మారింది. కాలక్రమేణా మారుతున్న రాజకీయ సమీకరణల నేపథ్యంలో, అదే బాటలో నడిచి సక్సెస్ సాధించాలని ఇప్పుడు మాజీ ముఖ్యమంత్రుల వారసులు తహతహలాడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, తెలంగాణలో కేటీఆర్ రాబోయే ఎన్నికలే లక్ష్యంగా 2027 నుంచి జనాల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**


ఆంధ్రప్రదేశ్ రాజకీయాల విషయానికొస్తే, వైఎస్ జగన్ తన తండ్రి బాటలోనే నడిచి విజయం అందుకున్న చరిత్ర ఉంది. గతంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, సుదీర్ఘ కాలం పాటు సాగిన జగన్ పాదయాత్ర ఆయనకు ముఖ్యమంత్రి పీఠాన్ని కట్టబెట్టింది. జనంతో మమేకమవ్వడం, వారి కష్టాలను స్వయంగా వినడం ద్వారా ప్రజల్లో ఒక రకమైన భరోసా నింపడంలో ఆయన సఫలమయ్యారు. అయితే, గత ఎన్నికల్లో అనూహ్యంగా ఘోర పరాజయాన్ని చవిచూసిన వైకాపా, ఇప్పుడు మళ్లీ పుంజుకోవడానికి అదే అస్త్రాన్ని ప్రయోగించాలని భావిస్తోంది. వచ్చే ఏడాది చివరి నుంచి ఏడాదిన్నర పాటు ప్రతి ఊరు తిరుగుతానని జగన్ ప్రకటించడం వెనుక పక్కా వ్యూహం కనిపిస్తోంది. జగన్ పాదయాత్ర ప్రకటన వెనుక ఉన్న అసలు ఉద్దేశం ప్రస్తుత కూటమి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడమే.



## ఎనిమిది మంది విద్యార్థుల ఆత్మహత్య

- ఇంటర్ ఫలితాల బాధతో ఎనిమిది మంది విద్యార్థుల ఆత్మహత్య
- భయంతో చనిపోయిన ఖమ్మం విద్యార్థి.. ఫలితాల్లో పాస్
- ఫెయిలయ్యామన్న భయంతోనే విద్యార్థుల బలవన్మరణాలు
- ప్రాణం తీసుకోవద్దు, మళ్లీ పరీక్ష రాసుకోవచ్చని సూచన
- పిల్లల నిర్ణయంతో కుటుంబాల్లో తీరని వేదన
- ఒత్తిడి ఉంటే 044-24640050 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయండి

03






## దక్షిణాదిని మోసం చేస్తారా మోదీ

- జనాభా లెక్కల వల్ల దక్షిణ రాష్ట్రాలకు సీట్లు తగ్గే ప్రమాదం
- కుటుంబ నియంత్రణ పాటించినందుకు దక్షిణాదిని శిక్షిస్తారా?
- ఉత్తరాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యత పెరిగే అవకాశం
- సీట్ల కేటాయింపులో జనాభాతో పాటు జీఎస్‌డీపీని పరిగణించాలి
- మహిళా రిజర్వేషన్లను పునర్విభజనతో ముడిపెట్టడం తప్పు
- అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలు తీసుకోవాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** దేశ రాజకీయాల్లో నియోజకవర్గాల పునర్విభజన చిచ్చు రేపుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన డిలిమిటేషన్ ప్రక్రియపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ఘాటుగా స్పందించారు. కేవలం ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ సాధించడం కోసమో, అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసమో దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను బలిపెట్టవద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. కేంద్రం అనుసరిస్తున్న ఈ మొండి వైఖరి వల్ల దక్షిణ భారతదేశం రాజకీయంగా తన ప్రాభవాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పెంపు అన్నది కేవలం సంఖ్యల లెక్క మాత్రమే కాదని, అది దేశ సమాఖ్య స్ఫూర్తికి పరీక్షా సమయమని ఆయన అభివర్ణించారు. అభివృద్ధి బాటలో పయనిస్తూ దేశానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న రాష్ట్రాలకు శిక్ష వేయడం ఏ రకమైన ధర్మమని ప్రశ్నించారు. డిలిమిటేషన్ అంశంపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన సందర్భంలో ఆయన కేంద్రంపై ప్రశ్నల వర్షం కురిపించారు. ముఖ్యంగా జనాభా ప్రాతిపదికన మాత్రమే లోక్‌సభ సీట్లను పెంచాలని చూడటం దక్షిణ రాష్ట్రాలకు జరిగే అతిపెద్ద అన్యాయమని తేల్చి చెప్పారు. దశాబ్దాలుగా కేంద్ర ప్రభుత్వాల సూచన మేరకు కుటుంబ నియంత్రణను ఒక క్రమశిక్షణగా అమలు చేసిన రాష్ట్రాలు ఇప్పుడు ఆ పాపానికే జరిమానా చెల్లించుకోవాల్సి మిగతా 2లో..

## ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్

- ఏప్రిల్ 22 నుంచి ఆర్టీసీ సమ్మె
- సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలి
- 30 శాతం జీతాల పెంపు అమలు చేయాలి
- మహాలక్ష్మి పథకం బకాయిలు విడుదల చేయాలి
- కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి
- స్పందించకుంటే సమ్మె ఆగదని జేఏసీ స్పష్టం

03




## నిధులివ్వకపోతే కోపం రాదా ..!

- ప్రభుత్వం అస్సలు పనిచేయడం లేదు
- మంత్రులు ఫోన్లు కూడా ఎత్తడం లేదు
- ప్రాజెక్టులకు నిధులు ఆగిపోయాయి
- బీఆర్ఎస్ పాలనే ఎంతో మేలు
- సొంత ప్రభుత్వంపైనే పోచారం తిరుగుబాటు

03





## ఇది రాబందు ప్రభుత్వం

- బోనస్ హామీని కాంగ్రెస్ అటకెక్కించి రైతులను ముంచింది
- కోటా పేరుతో కొనుగోళ్లు ఆపి రైతులను రోడ్డున పడేశారు
- క్వింటాల్ రూ.5,870 మద్దతు ధరతో వెంటనే పంట సేకరించాలి
- సీఎం గాలి మోటార్లలో తిరుగుతూ రైతుల గోడు మర్చిపోయారు
- గిట్టుబాటు ధర లేక రైతులు దళారులకు తక్కువకే అమ్ముకుంటున్నారు
- ప్రతి గింజను ప్రభుత్వమే కొనాలి, లేదంటే పోరాటం తప్పదు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో శనగల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మిగతా 2లో..

## సీట్ల పెంపుతో దక్షిణాదికి నష్టమేంటి?

- ఆదాయం ప్రాతిపదికన సీట్ల విభజన రాజ్యాంగ విరుద్ధం
- అదే నిజమైతే వెనుకబడిన జిల్లాల పరిస్థితి ఏమిటి?
- బాబాసాహెబ్ ఆశయాలను కాంగ్రెస్ అవమానిస్తోంది
- మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలాడుతోంది
- అందరికీ సమానంగా 50శాతం సీట్లు పెంచడమే లక్ష్యం
- రేవంత్ వ్యాఖ్యలు కేవలం విభజన రాజకీయాలే

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నియోజకవర్గాల పునర్విభజన వ్యవహారం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ సెగలు రేపుతోంది. ఆదాయం ప్రాతిపదికన పార్లమెంట్ సీట్ల కేటాయింపు ఉండాలంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదనపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ సమగ్రతకు, రాజ్యాంగ స్ఫూర్తికి మిగతా 2లో..





## నాడు సురేఖ నేడు సీతక్క

- తప్పుడు ఆరోపణలపై మంత్రి సీతక్క లీగల్ నోటీసు
- అంగన్‌వాడీ ఫోన్ల స్కామ్ ఆరోపణలు అబద్ధం
- ఆరోపణలు చేస్తే చెప్పుతో కొడతానని సీతక్క ఆగ్రహం
- 48 గంటల్లో పోస్టులు తీసేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్
- కొండా సురేఖ - కేటీఆర్ వివాదం మళ్లీ చర్చలోకి
- వరంగల్ మంత్రుల తీరుపై రాజకీయాల్లో ప్రకంపనలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎప్పుడూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. పౌరుషాలకు, పోరాటాలకు నిలయమైన ఈ గడ్డ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మహిళా మంత్రులు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారారు. మిగతా 3లో..

# సీట్ల పెంపుతో దక్షిణాదికి నష్టమేంటి?

**మొదటిపేజీ తరువాయి**

విరుద్ధంగా ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఈ తరహా వ్యాఖ్యలు సమాజంలో విభజన తీసుకువస్తాయని, బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి వాదనలు చేయడం తగదని సంజయ్ హితవు పలికారు. అభివృద్ధిని, రాజకీయాన్ని ముడిపెట్టి కొత్త వివాదాలకు కాంగ్రెస్ తెరలేపుతోందని ఆయన ఆరోపించారు. రేవంత్ రెడ్డి వాదనను లాజిక్ లేని వ్యవహారంగా బండి సంజయ్ కొట్టిపారేశారు. ఆదాయం ఎక్కువగా వచ్చే ప్రాంతాలకే ఎక్కువ సీట్లు ఇవ్వాలనే సూత్రం రాజ్యాంగంలో ఎక్కడా లేదని ఆయన గుర్తుచేశారు. ఒకవేళ ముఖ్యమంత్రి చెప్పినట్లే ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే, తెలంగాణలో కేవలం హైదరాబాద్‌కే అన్ని సీట్లు కేటాయించాల్సి వస్తుందని ఆయన ఎద్దేవా చేశారు. మరి అలాంటప్పుడు వెనుకబడిన పాలమూరు, ఆదిలాబాద్ వంటి జిల్లాల గతి ఏమవుతుందని నిలదీశారు. ఆదాయం తక్కువగా ఉన్నంత మాత్రాన ఆయా ప్రాంతాల ప్రజలకు ప్రాతినిధ్యం అవసరం లేదా అని సంజయ్ ప్రశ్నించారు. ఇది పేద ప్రాంతాలను మరింత అణచివేయడమే అవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలన్నీ ఇప్పుడు కేవలం డబ్బు చుట్టూనే తిరుగుతున్నాయని బండి సంజయ్ ఘాటుగా విమర్శించారు. ముఖ్యమంత్రి పదవిని అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ హైకమాండ్‌కు భారీగా నిధులు పంపుతున్నారని, ఆ క్రమంలోనే ఆయనకు ప్రతి అంశంలోనూ ఆదాయమే కనిపిస్తోందని విమర్శించారు. అభివృద్ధి అంటే కేవలం సంపదను లెక్కించడం కాదని, మారుమూల ప్రాంతాల్లోని సామాన్యుడి గొంతును చట్టసభల్లో వినిపించడమని ఆయన స్పష్టం చేశారు. కేవలం ఆర్థిక ప్రయోజనాలే పరమావధిగా రాజకీయాలు



చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు వంటిదని ఆయన హెచ్చరించారు. ముఖ్యమంత్రి తన వైఖరిని మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ పునాదులను కాంగ్రెస్ పార్టీ క్రమంగా బలహీనపరుస్తోందని సంజయ్ ఆరోపించారు. దేశంలో సమానత్వం ఉండాలని, ప్రతి పౌరుడికి సమానమైన ఓటు హక్కు, ప్రాతినిధ్యం ఉండాలని అంబేద్కర్ ఆకాంక్షించారని గుర్తుచేశారు. అయితే రేవంత్ రెడ్డి మాటలు అంబేద్కర్ ఆశయాలకు గొడ్డలి పెట్టులా ఉన్నాయని మండిపడ్డారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో ఆయన ఆత్మ క్షోభించేలా ముఖ్యమంత్రి మాట్లాడటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఒకవేళ అంబేద్కర్ గనుక ఇప్పుడు బతికి ఉంటే, రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఈ దేశం నుంచే బహిష్కరించేవారని సంజయ్ ధ్వజమెత్తారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని బండి సంజయ్ విమర్శించారు. గత ఐదు దశాబ్దాలుగా అధికారంలో ఉన్నప్పుడు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. నాడు పార్లమెంట్‌లో మహిళా బిల్లు కాపీలను చించిన ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీల వంటి శక్తులతో ఇప్పుడు కాంగ్రెస్ అపవిత్ర పొత్తులు పెట్టుకుందని దుయ్యబట్టారు. మహిళలకు అధికారం కల్పించాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు ఏనాడూ లేదని, కేవలం ఎన్నికల స్టంట్లు చేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని విమర్శించారు. మాటలకు, చేతలకు పొంతన లేని పార్టీగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోతుందని సంజయ్ అన్నారు. జనాభా పెరుగుదల వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే భయాలను తొలగించేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని బండి సంజయ్ వెల్లడించారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెంచాలనే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉందని ఆయన తెలిపారు. ఇది అన్ని ప్రాంతాల సమతుల్య అభివృద్ధికి, సరైన రాజకీయ ప్రాతినిధ్యానికి మార్గం సుగమం చేస్తుందని వివరించారు. ఉత్తరాది, దక్షిణాది అనే తేడాలు లేకుండా దేశమంతా ఒక్కటే అనే భావనతో బీజేపీ ముందుకు సాగుతోందని సంజయ్ స్పష్టం చేశారు. విద్వేషాలు రగిలించి పబ్బం గడుపుకోవడం కాంగ్రెస్ నైజమైతే, అందరినీ కలుపుకుని పోవడం మోదీ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కేవలం రాష్ట్రానికే కాకుండా దేశ సమైక్యతకు ముప్పు కలిగించేలా ఉన్నాయని బండి సంజయ్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాంతాల మధ్య, ప్రజల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం నీచమైన చర్య అని అభివర్ణించారు. నియోజకవర్గాల పునర్విభజన అనేది ఒక రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని, దానికి శాస్త్రీయమైన పద్ధతులు ఉంటాయని వివరించారు. ముఖ్యమంత్రి తన వ్యక్తిగత అభిప్రాయాలను రాజ్యాంగ నియమాలకు ఆపాదించడం సరికాదని హితవు పలికారు. ఇలాంటి అర్థరహితమైన వాదనలు మానుకుని రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని సంజయ్ సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ విభజన రాజకీయాలనే నమ్ముకుందని బండి సంజయ్ విమర్శించారు. గతంలో కులాల పేరుతో, మతాల పేరుతో ప్రజలను విడదీసిన ఆ పార్టీ, ఇప్పుడు సీట్ల విభజన పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతోందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదన వల్ల ధనిక ప్రాంతాలు మరింత బలపడి, పేద ప్రాంతాలు మరింత వెనుకబడిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సామాజిక న్యాయానికి పూర్తి విరుద్ధమని, బలహీన వర్గాలకు అన్యాయం చేసే కుట్ర అని సంజయ్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి వాస్తవాలను గ్రహించకుండా ముఖ్యమంత్రి గాలిలో మేడలు కడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకూ సమాన విలువ ఉంటుందని, దానికి సంపదతో ముడిపెట్టడం అజ్ఞానమని బండి సంజయ్ స్పష్టం చేశారు. చట్టసభల్లో ప్రాతినిధ్యం అనేది ప్రజల అవసరాలను, ఆకాంక్షలను ప్రతిబింబించాలని కోరారు. రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ విలువలపై గౌరవంతో ప్రవర్తించాలని, ముఖ్యమంత్రి స్థాయికి తగ్గట్టుగా మాట్లాడాలని సూచించారు. దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం అనుకుంటే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## జిల్లా వ్యాప్తంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమం ప్రారంభం



**రోడ్ సేఫ్టీపై విస్తృత అవగాహన**

**విశాలభారతి,నిర్మల్ ప్రతినిధి :**

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి ప్రజల ప్రాణ భద్రతను కాపాడాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ శాఖ, రవాణా శాఖలు సంయుక్తంగా "అరైవ్ అలైవ్" పేరిట జిల్లా వ్యాప్తంగా రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు ప్రారంభించాయి. ఈ కార్యక్రమాలు ఏప్రిల్ 13 నుండి 18 వరకు కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో సారంగాపూర్ మండలం ధని గ్రామంలో నిర్వహించిన రోడ్ సేఫ్టీ అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు, రక్షణాత్మక డ్రైవింగ్ (డిఫెన్సివ్ డ్రైవింగ్), హెల్మెట్ వినియోగం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతకు సంబంధించిన బ్రోచర్లను కూడా విడుదల చేశారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, అన్ని మండలాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి గ్రామ స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటుచేశారు. కమిటీ సభ్యులతో రహదారి భద్రతపై ప్రమాణం చేయించి, ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, ప్రమాదాల తగ్గింపునకు డిఫెన్సివ్ డ్రైవింగ్ ముఖ్యమని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సాయి కిరణ్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, రవాణా శాఖ అధికారి మహేందర్, తహసీల్దార్ సంధ్యా రాణి, ఎంపీడీవో లక్ష్మీకాంత్ రావు, ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హదీ, పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అడుగు అడుగున 'రాజకీయం'

**మొదటిపేజీ తరువాయి**

చంద్రబాబు పాలనలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూ, తన పాదయాత్ర మొదలైన తర్వాత ప్రత్యర్థులకు 'సినిమా' చూపిస్తానని ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వేడిని పెంచాయి. గతంలో లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర టీడీపీకి ఎంతటి బలాన్ని ఇచ్చిందో, ఇప్పుడు జగన్ చేపట్టబోయే యాత్ర తన కేడర్‌లో అంతటి ఉత్సాహాన్ని నింపుతుందని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. జనాల్లో తనకున్న పట్టును మళ్లీ నిరూపించుకోవడానికి, అధికారం కోల్పోయిన బాధ నుంచి కార్యకర్తలను బయటపడేయడానికి జగన్ ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. తెలంగాణలో సైతం రాజకీయ చిత్రం వేగంగా మారుతోంది. గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, అనూహ్యంగా కాంగ్రెస్ చేతిలో ఓడిపోవడం, ఆపై పార్లమెంటు ఎన్నికల్లో సున్నా సీట్లకు పడిపోవడం పార్టీ శ్రేణులను కలవరపెట్టింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన రాజకీయ వారసత్వాన్ని సుస్థిరం చేసుకోవడానికి పాదయాత్రను ఒక ఆయుధంగా మలచుకోవాలని చూస్తున్నారు. 2027లో తాను కూడా పాదయాత్ర చేస్తానని కేటీఆర్ ప్రకటించడం వెనుక తన ఇమేజ్‌ను పెంచుకోవాలనే తపన స్పష్టంగా కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యాలను జనంలోకి తీసుకెళ్లడం ద్వారా పార్టీకి పూర్వవైభవం తేవాలని ఆయన యోచిస్తున్నారు. కేటీఆర్ పాదయాత్ర వెనుక పార్టీ అంతర్గత సమీకరణలు కూడా ఒక కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలో సీనియర్ నేత, తన బావ అయిన హరీశ్ రావుతో ఆధిపత్య పోరులో వెనుకబడకుండా ఉండటానికి, క్షేత్రస్థాయిలో తనకంటూ ఒక ప్రత్యేక ప్రజాదరణను సంపాదించుకోవడం కేటీఆర్‌కు అత్యవసరం. కేవలం ట్విట్టర్ వేదికగానో, ప్రెస్ మీట్ల ద్వారానే కాకుండా నేరుగా జనం మధ్యకు వెళ్తేనే నాయకత్వ పటిమ పెరుగుతుందని ఆయన గ్రహించినట్లున్నారు. అందుకే తెలంగాణ నలుమూలలా పాదయాత్ర నిర్వహించి, కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యాలను ఎండగట్టాలని ఆయన భావిస్తున్నారు. ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీఆర్ఎస్ హయాంలోని అవినీతిపై విచారణలకు పరిమితం కావడం కేటీఆర్‌కు కలిసొచ్చే అంశంగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టు, ఫోన్ ట్యాపింగ్, ధరణి పోర్టల్ వంటి అంశాల్లో బీఆర్ఎస్ నేతలను జైలుకు పంపిస్తామని రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో గంభీరంగా





ప్రకటించినా, ఆచరణలో మాత్రం అడుగులు నెమ్మదిగా పడుతున్నాయి. వారిని జైలుకు పంపి రాజకీయ మైలేజీ ఇవ్వడం కంటే, విచారణల పేరుతో వారిని నిరంతరం డిఫెన్స్‌లో ఉంచడమే మేలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఈ రాజకీయ చదరంగంలో తమపై వస్తున్న ఆరోపణలను తిప్పికొట్టడానికి పాదయాత్రనే సరైన వేదిక అని కేటీఆర్ నిశ్చయించుకున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఒకే సమయంలో మాజీ సీఎంల వారసులు రోడ్ల మీదకు రానుండటం ఈ దశాబ్దపు అతిపెద్ద రాజకీయ పరిణామంగా నిలవనుంది. జగన్ తన పాత అనుభవాన్ని జోడించి పాదయాత్రను మరింత ఉధృతంగా నిర్వహించే అవకాశం ఉండగా, కేటీఆర్ తొలిసారిగా ఈ తరహా సాహసానికి పూనుకుంటున్నారు. ప్రజా సమస్యల కంటే కూడా తమ ఉనికిని చాటుకోవడానికి, కోల్పోయిన అధికారాన్ని వెతుక్కుంటూ చేస్తున్న ఈ ప్రయత్నాలు ప్రజల్లో ఎంతవరకు ఆదరణ పొందుతాయనేది ప్రశ్నార్థకమే. రెండు రాష్ట్రాల్లోనూ అధికార పార్టీలు తమదైన వ్యూహాలతో ఈ యాత్రలను అడ్డుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. గతంలో రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ జోడో యాత్ర' దేశవ్యాప్తంగా మంచి చర్చను లేవనెత్తినా, ఎన్నికల ఫలితాల్లో ఆశించిన మార్పును వెంటనే చూపలేకపోయింది. ఇప్పుడు జగన్, కేటీఆర్ చేసే యాత్రలు కూడా కేవలం జనసందోహానికి పరిమితం అవుతాయా లేక ఓట్ల వర్షం కురిపిస్తాయా అన్నది కాలమే నిర్ణయించాలి. ముఖ్యంగా యువతను ఆకట్టుకోవడానికి వీరు ఏ విధమైన అజెండాతో ముందుకు వెళ్తారనేది కీలకం. డిజిటల్ యుగంలో కేవలం నడకతోనే సరిపెట్టకుండా, సోషల్ మీడియా వేదికగా తమ యాత్రను ఏ విధంగా ప్రమోట్ చేసుకుంటారనేది వారి విజయానికి కీలకం కానుంది. అధికార పక్షాలు కూడా తక్కువ తినలేదు. జగన్, కేటీఆర్ పాదయాత్రలు మొదలయ్యే నాటికి ఏపీలో చంద్రబాబు, తెలంగాణలో రేవంత్ రెడ్డి తమ పాలనతో ప్రజలను ఏ మేరకు ఆకట్టుకుంటారనే దానిపై ఈ యాత్రల ప్రభావం ఆధారపడి ఉంటుంది. ఒకవేళ ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తే, ప్రతిపక్షాల పాదయాత్రలు నిష్ప్రయోజనంగా మారే ప్రమాదం ఉంది. ప్రత్యర్థుల అస్త్రాలకు ప్రతి అస్త్రాలను సిద్ధం చేయడంలో పాలక పక్షాలు ఇప్పటికే కసరత్తు ప్రారంభించాయి. పాదయాత్రల సందడిలో రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు తారాస్థాయికి చేరడం ఖాయం. మొత్తం మీద 2027 నాటికి తెలుగు రాష్ట్రాల రోడ్లు రాజకీయ నినాదాలతో హోరెత్తనున్నాయి. వారసత్వ రాజకీయాన్ని నిలబెట్టుకోవడానికి ఒకరు, పోగొట్టుకున్న వైభవాన్ని మళ్లీ దక్కించుకోవడానికి మరొకరు పడుతున్న ఈ ఆరాటం ప్రజాస్వామ్యంలో ఆసక్తికరమైన మలుపు. జనం నాడిని పట్టుకోవడంలో ఎవరు విజయం సాధిస్తారో, ఎవరి నడక వారిని సింహాసనం వైపు నడిపిస్తుందో చూడాలి. కేవలం పాదయాత్రలు చేస్తేనే అధికారం రాదని, ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడం ప్రధానమని ఈ యువ నేతలు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలుగు రాజకీయాల్లో ఈ పాదయాత్రల ట్రెండ్ ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాల్సిందే.

# దక్షిణాదిని మోసం చేస్తారా మోదీ

**మొదటిపేజీ తరువాయి**

వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభాను నియంత్రించి అభివృద్ధిని పరుగులు పెట్టించినందుకు ప్రతిఫలంగా రాజకీయ బలాన్ని తగ్గించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఈ విధానం వల్ల కష్టపడే రాష్ట్రాల కంటే కష్టాల్లో ఉన్న రాష్ట్రాలకే ఎక్కువ ప్రయోజనం చేకూరుతోందని విమర్శించారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న ఈ కొత్త విధానం అమలైతే ఉత్తరాది రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్లు అమాంతం పెరిగిపోతాయని రేవంత్ రెడ్డి విశ్లేషించారు. అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాల్లో సీట్ల పెరుగుదల చాలా నామమాత్రంగానే ఉంటుందని గణాంకాలతో వివరించారు. ప్రస్తుతం ఉన్న అసమతుల్యత ఈ ప్రక్రియ తర్వాత మరింత పెరిగిపోతుందని హెచ్చరించారు. లోక్‌సభలో ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యం పెరగడం వల్ల దక్షిణాదికి దక్కాల్సిన నిధులు, ప్రాధాన్యత తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం జనాభా ఎక్కువగా ఉందన్న కారణంతో ఉత్తరాది రాష్ట్రాలు కేంద్ర అధికారాన్ని శాసించే స్థాయికి వెళ్తే, దక్షిణాది రాష్ట్రాలు కేవలం ప్రేక్షక పాత్రకే పరిమితం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇది దేశ సమగ్రతకు ఏమాత్రం క్షేమకరం కాదని స్పష్టం చేశారు. రాజకీయంగా పట్టు సాధించడం కోసం దక్షిణాదిని ద్వితీయ శ్రేణిగా మారుస్తున్నారా అంటూ సీఎం రేవంత్ రెడ్డి నేరుగానే కేంద్రాన్ని ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక కేవలం రాజకీయ ప్రయోజనాలే దాగి ఉన్నాయని ఆయన ఆరోపించారు. కేంద్రంలోని పాలక పక్షం తన బలాన్ని పెంచుకోవడానికి అనుకూలమైన ప్రాంతాలలో సీట్లను పెంచుకుంటూ పోతే, వ్యతిరేకత ఉన్న ప్రాంతాల ప్రాముఖ్యతను తగ్గించే కుట్ర జరుగుతోందని విమర్శించారు. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ బిల్లును డిలిమిటేషన్‌తో ముడిపెట్టడం వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని ఆయన ఎండగట్టారు. మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలనే సదుద్దేశం ఉంటే దాన్ని నియోజకవర్గాల పునర్విభజనతో సంబంధం లేకుండానే అమలు చేయవచ్చని సూచించారు. ఆ రెండింటిని కలపడం వల్ల సామాజిక న్యాయం వెనుకబడి రాజకీయ కుతంత్రాలు ముందుకు వస్తున్నాయని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ల అంశంపై తమ పార్టీకి, ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే దాన్ని అడ్డం పెట్టుకుని



దక్షిణాదిని అణచివేసే ప్రయత్నాలను మాత్రం సహించబోమని తేల్చి చెప్పారు. రిజర్వేషన్లు కల్పించడం అన్నది ఒక సామాజిక బాధ్యత అని, దాన్ని రాజ్యాంగపరమైన సంక్లిష్టతలతో ముడిపెట్టి జాప్యం చేయడం సరైనది కాదని వ్యాఖ్యానించారు. మహిళా సాధికారతకు తాము ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని, కానీ దాని ముసుగులో దక్షిణ రాష్ట్రాల గొంతు నొక్కే డిలిమిటేషన్ ప్రక్రియను సమర్థించలేమని కుండబద్దలు కొట్టారు. రాజకీయ ప్రయోజనాల కోసం సామాజిక ఆకాంక్షలను పావులుగా వాడుకోవద్దని కేంద్రానికి హితవు పలికారు. ఈ విషయంలో తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ వివాదాస్పద అంశంపై రేవంత్ రెడ్డి ఒక వినూత్నమైన ప్రతిపాదనను కేంద్రం ముందుంచారు. కేవలం జనాభా లెక్కలనే ప్రాతిపదికగా తీసుకోకుండా, రాష్ట్రాల ఆర్థిక భాగస్వామ్యాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా అత్యధికంగా ఉందని గుర్తు చేశారు. కాబట్టి జనాభాతో పాటు రాష్ట్రాల జీఎస్‌డీపీ ఆధారంగా లోక్‌సభ సీట్ల కేటాయింపు ఉండాలని డిమాండ్ చేశారు. పన్నుల రూపంలో కేంద్రానికి భారీగా ఆదాయాన్ని సమకూర్చుతున్న రాష్ట్రాలకు తగిన రాజకీయ గుర్తింపు ఉండాలని కోరారు. అప్పుడే సమాఖ్య వ్యవస్థలో అన్ని రాష్ట్రాలకు సమాన న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. అభివృద్ధిని, క్రమశిక్షణను గౌరవించే విధంగా కొత్త మోడల్‌ను రూపొందించాలని సూచించారు. నియోజకవర్గాల పునర్విభజన వంటి అత్యంత సున్నితమైన అంశంపై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని రాజకీయ పార్టీల, రాష్ట్రాల అభిప్రాయాలను సేకరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల అసెంబ్లీలలో కూడా దీనిపై చర్చ జరగాలని కోరారు. ఎవరికీ అన్యాయం జరగకుండా ఒక ఏకాభిప్రాయానికి వచ్చిన తర్వాతే ముందడుగు వేయాలని సూచించారు. కేవలం మెజారిటీ ఉందన్న కారణంతో పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. దక్షిణాది ప్రజల మనోభావాలను గౌరవించని ఏ నిర్ణయమైనా తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని హెచ్చరించారు. అన్ని వర్గాల ఆమోదంతోనే ఈ ప్రక్రియ సాగాలని కోరారు. లోక్‌సభ సీట్ల పెంపు విషయంలో తొందరపాటు నిర్ణయాలు వద్దని రేవంత్ రెడ్డి సూచించారు. 2027 లో జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో దీనిపై సమగ్రమైన చర్చ జరిపి తుది నిర్ణయం తీసుకోవడం ఉత్తమమని అభిప్రాయపడ్డారు. అప్పటి వరకు అన్ని కోణాల్లో అధ్యయనం చేయడానికి సమయం ఉంటుందని తెలిపారు. నిపుణుల కమిటీని వేసి భౌగోళిక, ఆర్థిక, సామాజిక అంశాలను పరిశీలించాలని కోరారు. హడావిడిగా డిలిమిటేషన్ పూర్తి చేస్తే అది దేశ విభజన రేఖలను మరింత స్పష్టం చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే తరాలకు ఒక సుస్థిరమైన వ్యవస్థను అందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. ఆలోచనాత్మకమైన చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం లభిస్తుందని నమ్మారు. దేశ సమగ్రతను దృష్టిలో ఉంచుకుని ఈ అంశాన్ని చాలా జాగ్రత్తగా డీల్ చేయాలని రేవంత్ రెడ్డి ప్రధానికి విజ్ఞప్తి చేశారు. ఉత్తర, దక్షిణ భారతం అనే భావజాలం బలపడకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉందని గుర్తు చేశారు. రాజకీయ లబ్ధి కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యమని చాటిచెప్పారు. దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికంగా దేశాన్ని ముందుకు నడిపిస్తున్నాయని, వాటిని నైతికంగా బలహీనపరచడం దేశాభివృద్ధిని దెబ్బతీయడమేనని అన్నారు. కేంద్రం తన ఆలోచనా విధానాన్ని మార్చుకుని, దక్షిణాది ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించాలని కోరారు. సమానత్వం అంటే కేవలం అంకెల సమానత్వం కాదని, అది గౌరవంలో సమానత్వం అని పేర్కొన్నారు.

# ఇది రాబందు ప్రభుత్వం

**మొదటిపేజీ తరువాయి**

ఎన్నికల వేళ రైతు డిక్లరేషన్ పేరిట ప్రతి పంటకూ బోనస్ ఇస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నేడు అధికారంలోకి వచ్చాక ఆ హామీని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అరవై వేల క్వింటాళ్ల శనగలు రైతుల వద్దే నిలిచిపోయాయని పేర్కొంటూ తక్షణమే క్వింటాలుకు ఐదు వేల ఎనిమిది వందల డెబ్బై రూపాయల మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి వారం రోజులుగా పడిగాపులు కాస్తున్నా పాలకులకు కనికరం కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సదాశివపేట రైతు సేవా కేంద్రంలో శనగలు పోసి నిరీక్షిస్తున్న అన్నదాతల కష్టాలను హరీశ్‌రావు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కోటా పూర్తి అయిందనే సాకుతో కొనుగోళ్లు నిలిపివేయడం వల్ల రైతులు ఆరుగాలం శ్రమించిన పంటను రోడ్ల పక్కనే ఆరబోసి అల్లాడుతున్నారని మండిపడ్డారు. సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావుతో కలిసి వచ్చిన ఆయన అధికారుల తీరును నిలదీశారు. పంట పండించిన రైతును అరిగోస పెట్టడం ఏ రకమైన ప్రజా పాలన అని ప్రశ్నిస్తూ క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇంత దారుణంగా ఉంటే ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కేవలం కాంట్రాక్టులు, కమీషన్ల కోసమే సమీక్షలు నిర్వహిస్తోందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పల్లెల్లో రైతులు పడుతున్న ఇబ్బందులు గాలికి వదిలేసి పాలకులు గాలి మోటార్లలో విహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఢిల్లీ, కేరళ పర్యటనల బిజీలో ఉన్న ముఖ్యమంత్రికి తన సొంత రాష్ట్రంలోని అన్నదాతల కన్నీళ్లు కనిపించడం లేదని విమర్శించారు. ఇంటెలిజెన్స్ వర్గాలు కొనుగోళ్లు ఆగిపోయిన సమాచారాన్ని ప్రభుత్వానికి చేరవేయడం లేదా అని సందేహం వ్యక్తం చేశారు. పేద రైతుల సమస్యలపై సమీక్ష చేయడానికి సమయం దొరకని ఈ ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తోందని నిలదీశారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు పంటను దళారులకు అమ్ముకుని క్వింటాలుకు వెయ్యి రూపాయల వరకు నష్టపోతున్నారని హరీశ్‌రావు వాపోయారు. ఎకరానికి పది వేల రూపాయల మేర నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెటింగ్ శాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రులు క్షేత్రస్థాయిలోకి వచ్చి రైతుల గోసను చూడాలని కోరారు. సదాశివపేటలో ఇప్పటికే కొనుగోలు చేసిన శనగలను కూడా బిల్లులు కాలేదనే కారణంతో బస్తాలు ఖాళీ చేసి రైతులకు తిరిగి అప్పగించడం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. వారం రోజులుగా కేంద్రం వద్దే



ఉంటూ మొగలయ్య వంటి రైతులు కన్నీరు పెట్టుకోవడం కలిచివేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో పండిన ప్రతి గింజను మద్దతు ధరకు కొనాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన బోనస్ హామీ కేవలం 'బోగస్' అని తేలిపోయిందని ఎద్దేవా చేశారు. సన్నవడ్లకు గత యాసంగితో పాటు ఈ యాసంగిలోనూ బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏటిగడ్డ సంఘం వంటి గ్రామాల నుంచి వచ్చిన రైతులు తమ గోడును వినిపించారని చెప్పారు. రైతులు తమ ధాన్యం కొంటారని ఆశతో డీసీఎంఎస్ సెంటర్లకు వస్తే అధికారులు నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నారని మండిపడ్డారు. సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు కూడా సకాలంలో సరఫరా చేయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. వ్యవసాయ రంగానికి పగలు కేవలం పది గంటల విద్యుత్ మాత్రమే సరఫరా అవుతోందని హరీశ్‌రావు ఆరోపించారు. ఉదయం ఎనిమిది గంటలకు కరెంటు వస్తోందని మల్లేషం అనే రైతు తనతో వాపోయాడని గుర్తు చేశారు. సాగు నీరు అందక, విద్యుత్ కోతలతో సతమతమవుతున్న రైతులకు కనీసం మద్దతు ధర కూడా దక్కడం లేదన్నారు. రైతుబంధు నిధులు సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల రైతులు పెట్టుబడి కోసం అప్పుల పాలవుతున్నారని ఆవేదన చెందారు. ఇది ముమ్మాటికీ రైతు వ్యతిరేక ప్రభుత్వమని, దళారులు లాభపడేలా విధానాలు రూపొందిస్తున్నారని విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో మక్కజొన్న సాగు పదిహేను లక్షల ఎకరాల్లో జరిగితే సగం కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభం కాలేదని హరీశ్‌రావు గుర్తు చేశారు. గొనె సంచులు లేవని, టోకెన్ల పంపిణీ ఆపేశామని చెప్పి రైతులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దతు ధర రెండు వేల నాలుగు వందల రూపాయలు ఉండగా రైతులు విధిలేక పదహారు వందల రూపాయలకే అమ్ముకుంటున్నారని చెప్పారు. జొన్నల కొనుగోలుపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం వల్ల అన్నదాతలు పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకకు వెళ్లి అమ్ముకునే దుస్థితి ఏర్పడిందని తెలిపారు. అక్కడ కూడా తక్కువ ధరకే పంటను వదులుకుంటున్నారని వాపోయారు. వడ్లు రోడ్ల మీదనే ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నా పాలకుల్లో చలనం లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. మక్కలు, కందులు, శనగలు, జొన్నలకు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు మడమ తిప్పారని విమర్శించారు. సన్నవడ్లకైనా ఈ యాసంగిలో బోనస్ ఇస్తారో లేదో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. పాత బకాయిలు కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులు రోడ్ల మీద ధర్నాలు చేస్తున్నా పట్టించుకోని ముఖ్యమంత్రి తక్షణమే తన విదేశీ, ఇతర రాష్ట్రాల పర్యటనలు పక్కన పెట్టి ధాన్యం సేకరణపై దృష్టి పెట్టాలని సూచించారు. సదాశివపేట పర్యటనలో హరీశ్‌రావు వెంట భారీగా తరలివచ్చిన రైతులతో ఆ ప్రాంతం నిండిపోయింది. రైతులు తమ వద్ద ఉన్న పంట బస్తాలను చూపిస్తూ పడుతున్న ఇబ్బందులను వివరించారు. ప్రభుత్వం స్పందించి కొనుగోళ్లు చేపట్టే వరకు బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని భరోసా ఇచ్చారు. ప్రతి గింజను కొనుగోలు చేసేలా ఒత్తిడి తెస్తామని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు లేకపోవడం, రైతులు ఆకలితో అలమటించడం ఈ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. మొద్దునిద్ర వీడి ప్రభుత్వం తక్షణమే మేల్కోవాలని హరీశ్‌రావు హెచ్చరించారు. శనగల కొనుగోలుకు ఉన్న కోటా నిబంధనలను సడలించి నిల్వ ఉన్న పంట మొత్తాన్ని సేకరించాలన్నారు. సన్‌ఫ్లవర్, జొన్నల కొనుగోలు కేంద్రాలను కూడా వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి రైతులను ఇబ్బంది పెట్టడం మానుకోవాలని సూచించారు. రైతులకు న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. సంగారెడ్డి ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలంగాణ అంతటా ప్రతిబింబిస్తున్నాయని హరీశ్‌రావు విశ్లేషించారు.

# నాడు సురేఖ.. నేడు సీతక్క

**మొదటిపేజీ తరువాయి**



ఫైర్ బ్రాండ్స్‌గా ముద్ర పడిన మంత్రులు కొండా సురేఖ, సీతక్క వ్యవహారశైలి గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపుతోంది. ఒకరు సినిమా రాజకీయాలతో రచ్చ చేస్తే, మరొకరు పాలనాపరమైన ఆరోపణలపై ఏకంగా ప్రతిపక్ష నేతకే లీగల్ నోటీసులు పంపే వరకు వెళ్లారు. అధికార పక్షానికి చెందిన ఈ ఇద్దరు కీలక నేతలు వివాదాలకు కేంద్ర బిందువు కావడంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సీతక్క తాజా వివాదంతో వార్తల్లో నిలిచారు. అంగన్వాడీ కార్యకర్తల కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిన మొబైల్ ఫోన్ల వ్యవహారమే దీనికి ప్రధాన కారణం. ఈ కొనుగోళ్లలో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయని, అధికార పార్టీ నేతల హస్తం ఉందంటూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభించింది. సామాన్య ప్రజలకు దగ్గరగా ఉండే నాయకురాలిగా పేరున్న సీతక్కను లక్ష్యంగా చేసుకుని చేసిన ఈ విమర్శలు ఒక్కసారిగా రాజకీయ సెగను పెంచాయి. తన వ్యక్తిత్వాన్ని హననం చేసేలా ప్రతిపక్ష పార్టీ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతోందని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని, హద్దులు దాటితే చెప్పుతో కొడతానంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు తీవ్ర సంచలనం సృష్టించాయి. ప్రజా జీవితంలో ఉన్న వారు వాస్తవాలు తెలుసుకోకుండా బురద చల్లడం సరికాదని ఆమె హెచ్చరించారు. అధికారం పోయినా అబద్ధాలు ప్రచారం చేయడం మానలేదని బీఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలు రెండు పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారితీశాయి. అంతటితో ఆగకుండా మంత్రి సీతక్క ఏకంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బాధ్యుడిని చేస్తూ లీగల్ నోటీసులు పంపడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. పార్టీ సోషల్ మీడియా విభాగం చేసే ప్రతి తప్పుకూ ఆ పార్టీ అధ్యక్షుడే బాధ్యత వహించాలని ఆమె స్పష్టం చేశారు. 48 గంటల లోపు తనపై చేసిన ఆరోపణలను తొలగించి, బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసులో డిమాండ్ చేశారు. లేని పక్షంలో సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి వెనకాడబోనని ఖచ్చితంగా చెప్పారు. ఒక సిట్టింగ్ మంత్రి మాజీ సీఎంతో న్యాయపోరాటానికి దిగడం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు కొండా సురేఖ వ్యవహారం ఇంకా సద్దుమణగక ముందే సీతక్క ఇష్యూ తెరపైకి వచ్చింది. కొండా సురేఖ గతంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో కలకలం రేపాయి. రాజకీయ విమర్శలు చేయాల్సింది పోయి, వ్యక్తిగత జీవితాలను, సినిమా సెలబ్రిటీల విడాకుల అంశాలను రాజకీయాల్లోకి లాగడంపై సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రముఖ సినీ నటులు నాగార్జున, సమంత, నాగచైతన్యల పేర్లను ప్రస్తావించి ఆమె చేసిన ఆరోపణలు కాంగ్రెస్ పార్టీని కూడా ఇరకాటంలో పడేశాయి. కొండా సురేఖ వ్యాఖ్యలపై అక్కినేని కుటుంబం తీవ్రంగా స్పందించింది. తమ కుటుంబ గౌరవానికి భంగం కలిగించారంటూ నాగార్జున ఏకంగా 100 కోట్ల రూపాయల పరువు నష్టం దావా వేశారు. క్షమాపణలు చెప్పినా న్యాయస్థానంలో తేల్చుకుంటామని స్పష్టం చేశారు. అదే సమయంలో కేటీఆర్ కూడా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టును ఆశ్రయించారు. ఇలా ఒకేసారి పలువురు ప్రముఖులతో న్యాయపోరాటం చేయాల్సిన పరిస్థితిని సురేఖ స్వయంగా కొనితెచ్చుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తన మాటల తూటాలతో ప్రత్యర్థులను అడ్డుకోవాలని చూసి, చివరకు తానే ఇబ్బందుల్లో పడ్డారు. సురేఖ వివాదం కేవలం ప్రతిపక్షాలకే పరిమితం కాలేదు. ఆమె సొంత పార్టీలోని మంత్రులతో కూడా విభేదాలు పెంచుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో ఆమెకు పొసగడం లేదని బహిరంగంగానే తెలుస్తోంది. మేడారం జాతర పనుల విషయంలో క్రెడిట్ కోసం సాగిన పోరు పార్టీలో అసంతృప్తికి దారితీసింది. అంతేకాకుండా ఆమె ఓఎస్డీ వ్యవహారంలో కుటుంబ సభ్యుల జోక్యం ఎక్కువగా ఉందనే ఆరోపణలు రావడంతో అధిష్టానం కూడా సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. ఇది ప్రభుత్వ ప్రతిష్టపై ప్రభావం చూపుతోందని సొంత పార్టీ నేతలే గుసగుసలాడుకుంటున్నారు. ఈ ఇద్దరు మంత్రుల వ్యవహారశైలిని గమనిస్తే ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలు ఎంత వేడెక్కాయో అర్థం చేసుకోవచ్చు. ఒకప్పుడు ఉద్యమాలకు ఊపిరిపోసిన ఈ నేతలు, ఇప్పుడు కోర్టు కేసులు, నోటీసులతో కాలం గడుపుతున్నారు. సీతక్క పంపిన లీగల్ నోటీసుపై బీఆర్ఎస్ శ్రేణులు ఎదురుదాడికి దిగుతున్నాయి. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి బెదిరింపులకు పాల్పడుతోందని వారు ఆరోపిస్తున్నారు. రాజకీయ విమర్శలను న్యాయపరమైన అంశాలుగా మార్చడం ప్రజాస్వామ్యంలో సరైన పద్ధతి కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రస్తుత తరం రాజకీయాల్లో సోషల్ మీడియా పాత్ర కీలకంగా మారింది. ఏ చిన్న పొరపాటు చేసినా క్షణాల్లో వైరల్ అవుతోంది. ఇలాంటి తరుణంలో మంత్రులు ఆచితూచి మాట్లాడాల్సింది పోయి, భావోద్వేగాలకు లోనై చేస్తున్న వ్యాఖ్యలు వారికే చేటు తెస్తున్నాయి. సీతక్క మొబైల్ ఫోన్ల కొనుగోలులో అవినీతి జరగలేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ నోటీసులు పంపడం వల్ల సమస్య పరిష్కారం కాకపోగా, మరింత వివాదాస్పదంగా మారుతోంది. ఇది ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మొత్తానికి వరంగల్ ఫైర్ బ్రాండ్స్ తీరు రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. కొండా సురేఖ, సీతక్క వ్యవహారాలు చివరకు ఎటు దారితీస్తాయో చూడాలి. కేటీఆర్, కేసీఆర్ వంటి హేమాహేమీలను న్యాయస్థానాల ద్వారా ఎదుర్కోవాలని చూస్తున్న ఈ మంత్రుల వ్యూహం ఫలిస్తుందా లేక రివర్స్ అవుతుందా అనేది ఆసక్తికరంగా మారింది. ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో ఉన్న వారు వివాదాలకు దూరంగా ఉండి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని జనం కోరుకుంటున్నారు. రాబోయే రోజుల్లో ఈ వివాదాలు చల్లారుతాయా లేక మరింత ముదురుతాయా అనేది వేచి చూడాల్సిందే.

# ఎనిమిది మంది విద్యార్థుల ఆత్మహత్య

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడిన వేళ ఎన్నో గృహాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయామని, తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చలేకపోయామనే ఆవేదనతో పసిప్రాయంలోనే ఎనిమిది మంది విద్యార్థులు తనువు చాలించడం సభ్య సమాజాన్ని కలచివేస్తోంది. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు, ఖమ్మం నుంచి రంగారెడ్డి వరకు వినిపిస్తున్న ఈ రోదనలు కేవలం ఆ కుటుంబాలకే పరిమితం కావు. ఈ మరణాలు విద్యార్థుల క్షణికావేశానికి పరాకాష్టగా కనిపిస్తున్నా, వాటి వెనుక బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం వైఫల్యం స్పష్టంగా గోచరిస్తోంది. విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దడంలో, విద్యార్థులకు కనీస భరోసా ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమవడమే ఈ ఘోరాలకు ప్రధాన కారణమనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం దంతనపల్లిలో ఒక ఆశల దీపం ఆరిపోయింది. బైపీసీ ప్రథమ సంవత్సర ఫలితాల్లో రెండు సబ్జెక్టులు తప్పాననే వేదనతో ఆ విద్యార్థిని చున్నీతో ఉరి వేసుకుంది. ఈ ఘటన రాష్ట్రంలోని విద్యాబోధన తీరును ఎండగడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు కనీస మార్గదర్శకత్వం అందించడంలో విద్యాశాఖ ఘోరంగా విఫలమైంది. గిరిజన ప్రాంతాల్లోని కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించకుండా, కేవలం ఫలితాల కోసం ఒత్తిడి తేవడం వల్లనే ఇలాంటి పసి హృదయాలు ఒత్తిడిని తట్టుకోలేక బలిపీఠం ఎక్కుతున్నాయి. పాలకులు అభివృద్ధి గురించి గొప్పలు చెబుతున్నా, ఇలాంటి చిన్నారుల ప్రాణాలు కాపాడలేకపోవడం వ్యవస్థకే అవమానకరం. రాజధాని నడిబొడ్డున ఉన్న నాచారంలో ఒక విద్యార్థిని గణితం సబ్జెక్టులో విఫలమయ్యానని బలవన్మరణానికి పాల్పడటం గమనార్హం. మెదక్ జిల్లా నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చిన కుటుంబంలోని మరో కిశోరం సీఈసీలో ఫెయిలయ్యానని దూలానికి వేలాడింది. ఈ నగర జీవనంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఆందోళనలను గుర్తించడంలో ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. కనీసం పరీక్షా ఫలితాల ముందు విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇవ్వాలనే ఆలోచన చేయకపోవడం నేటి పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ప్రతి ప్రాణం వెనుక ఒక కుటుంబం ఆశయం దాగి ఉంటుందని తెలిసినా, సామాజిక భద్రత కల్పించడంలో అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. మహబూబ్ నగర్ జిల్లా అన్నసాగర్ గ్రామంలో మరో విషాదం చోటుచేసుకుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ చదివిన విద్యార్థిని ద్వితీయ సంవత్సరంలోనూ తప్పడంతో ప్రాణాలు తీసుకుంది. ఇక్కడ ప్రభుత్వ విద్యాసంస్థల దుస్థితిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు దిగజారడం, బోధనా సిబ్బంది కొరత వంటి అంశాలు విద్యార్థులను వైఫల్యం వైపు నెడుతున్నాయి. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వం కేవలం సంఖ్యలకే ప్రాధాన్యత ఇస్తోంది కానీ, విద్యార్థుల మానసిక దృఢత్వం గురించి పట్టించుకోవడం లేదు. సరైన సమయంలో ఉపాధ్యాయులు అండగా నిలిచి ఉంటే ఆ చిన్నారి ప్రాణాలు దక్కేవేమో అన్న ఆవేదన ప్రజల్లో నెలకొంది. సూర్యాపేట జిల్లాలో ఒక గురుకుల విద్యార్థిని స్నానాల గదిలో ఉరివేసుకోవడం విద్యాశాఖ నియంత్రణలో ఉన్న గురుకులాల పనితీరును ప్రశ్నిస్తోంది. ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే గురుకులాల్లో కనీసం విద్యార్థుల మనోభావాలను పంచుకునే వాతావరణం లేకపోవడం దారుణం. శిక్షణ పేరుతో విద్యార్థులను బందీలుగా మార్చుతున్న తీరుపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఒక చిన్న సబ్జెక్టులో విఫలమైతే ప్రాణాలు తీసుకునేంతటి భయాన్ని నింపుతున్నారంటే అక్కడ విద్య ఏ రకంగా అందుతుందో అర్థం చేసుకోవచ్చు. అధికార పార్టీ నేతలు ప్రచార ఆర్భాటాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఉన్న ఇలాంటి లోపాలను ఎందుకు సరిదిద్దడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సికింద్రాబాద్ వారాసిగూడ, రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ పరిధిలో జరిగిన ఆత్మహత్యలు విద్యార్థుల భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఎంపీసీ చదువుతున్న విద్యార్థిని ఫ్యాన్ కు ఉరివేసుకోవడం, మరొక విద్యార్థి ద్వితీయ సంవత్సరంలో పాస్ కాలేదని తనువు చాలించడం చూస్తుంటే వ్యవస్థ ఎంత నిర్వీర్యం అయిందో తెలుస్తోంది. ప్రభుత్వం కేవలం కార్పొరేట్ విద్యా సంస్థల లాబీయింగ్ కు తలొగ్గి సామాన్య విద్యార్థులను విస్మరిస్తోంది. పరీక్షల నిర్వహణలో, ఫలితాల ప్రకటనలో చూపిస్తున్న అత్యుత్సాహం విద్యార్థుల ప్రాణాలను కాపాడటంలో ఎందుకు చూపడం లేదనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేనని విపక్షాలు ఆరోపిస్తున్నా పాలకులు స్పందించకపోవడం శోచనీయం. ఖమ్మం జిల్లా మధిరలో జరిగిన ఘటన రాష్ట్ర చరిత్రలో ఒక చేదు జ్ఞాపకంగా మిగిలిపోనుంది. ఫలితాలకు రెండు రోజుల ముందే ఫెయిల్ అవుతానన్న భయంతో పట్టాల మీద ప్రాణాలు తీసుకున్న ఆ యువకుడు ఫలితాల్లో 347 మార్కులతో పాసయ్యాడు. ఇది విద్యార్థుల్లో ఉన్న భయాందోళనలను మాత్రమే కాకుండా, ప్రభుత్వం సృష్టించిన పరీక్షా వ్యవస్థ ఎంతటి గందరగోళాన్ని కలిగిస్తోందో రుజువు చేస్తోంది. అసలు పరీక్షలంటే ప్రాణాలు తీసుకునేంతటి జటిలమైన ప్రక్రియ అని విద్యార్థుల మనసుల్లో నాటుకుపోయేలా చేయడం ప్రభుత్వ వైఫల్యం కాదా? అన్నీ ఉన్నా ఆత్మవిశ్వాసం కోల్పోయిన ఆ విద్యార్థి మరణానికి నైతిక బాధ్యత ఎవరు వహిస్తారనే ప్రశ్న తలెత్తుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానాలు కేవలం యాంత్రికంగా సాగుతున్నాయి. విద్యార్థుల్లో సృజనాత్మకతను, ఆత్మవిశ్వాసాన్ని నింపేలా కాకుండా, కేవలం ర్యాంకుల వేటలో వారిని బలిపశువులను చేస్తున్నాయి. విద్యార్థుల మానసిక స్థితిని అర్థం చేసుకునే మనస్తత్వ నిపుణులను ప్రతి కళాశాలలో ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు ఎన్నో ఏళ్లుగా కాగితాలకే పరిమితం అయ్యాయి. ప్రభుత్వానికి మద్యం అమ్మకాలపై ఉన్న శ్రద్ధ విద్యా వ్యవస్థను సంస్కరించడం మీద లేదని విశ్లేషకులు మండిపడుతున్నారు. ఫలితాల విడుదల తర్వాత ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారు. నిజానికి ఓటమి అనేది జీవితంలో ఒక చిన్న మజిలీ మాత్రమే. పరీక్షలు అనేవి కేవలం విద్యార్థి జ్ఞానాన్ని కొలిచే సాధనాలే తప్ప జీవితాన్ని నిర్ణయించేవి కావు. కానీ నేటి సమాజంలో, విద్యా వ్యవస్థలో నెలకొన్న తీవ్రమైన పోటీ విద్యార్థుల మెడకు ఉరితాళ్లుగా మారుతున్నాయి. తల్లిదండ్రుల ఆశలను భారంలా భావించే పరిస్థితిని ప్రభుత్వం ఎందుకు పోగొట్టలేకపోతోంది? ప్రచారాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసే పాలకులు, విద్యార్థులకు ధైర్యం చెప్పే అవగాహన కార్యక్రమాల కోసం పైసా ఖర్చు చేయడం లేదు.

# నిధులివ్వకపోతే కోపం రాదా ..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అధికార పక్షంలో అసంతృప్తి జ్వాలలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తనదైన శైలిలో ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా? ఉంటే అది సక్రమంగా పని చేస్తోందా? అన్న సందేహాన్ని వ్యక్తం చేస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపాయి. సీనియర్ నాయకుడైన పోచారం ఈ స్థాయిలో బహిరంగంగా ధ్వజమెత్తడం వెనుక పెద్ద వ్యూహమే ఉందన్న చర్చ జోరుగా సాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మిగిలిపోయాయన్నది ఆయన ప్రధాన ఆరోపణగా కనిపిస్తోంది. పాలనలో మంత్రుల వైఖరి అత్యంత దారుణంగా ఉందంటూ పోచారం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యేలు ఫోన్లు చేస్తే మంత్రులు కనీసం స్పందించడం లేదని దుయ్యబట్టారు. ఒక ప్రజాప్రతినిధిగా తన నియోజకవర్గ నిధుల కోసం మంత్రికి దాదాపు 20 సార్లు విన్నవించినా ఫలితం లేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ప్రజా సేవలో దశాబ్దాల అనుభవం ఉన్న తన లాంటి సీనియర్ నేతలకు ప్రభుత్వంలో ఎదురవుతున్న అవమానాలపై ఆయన గొంతు విప్పారు. ఈ వయస్సులో నిధుల మంజూరు కోసం మంత్రుల కాళ్లు మొక్కాల్సిన దుస్థితి తనకు వచ్చిందా? అని ఆయన ప్రశ్నించడం పార్టీ శ్రేణుల్లో పెద్ద చర్చకు దారితీసింది. గత ప్రభుత్వ హయాంలో పాలన సాగిన తీరును ఈ సందర్భంగా పోచారం గుర్తు చేసుకున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకపోయేదని, ఇంట్లో కూర్చుంటేనే జీవోలు విడుదలయ్యే పరిస్థితి ఉండేదని కొనియాడారు. సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులకు నిధుల కేటాయింపులో జాప్యం జరగడంపై ఆయన తీవ్ర అసంతృప్తిని వెళ్లగక్కారు. సొంత ప్రభుత్వంపైనే ఇలా నిరసన స్వరం వినిపించడం వెనుక కేవలం అభివృద్ధి పనుల జాప్యమే ఉందా లేక రాజకీయంగా ఏదైనా మార్పుకు ఆయన సిద్ధమవుతున్నారా అనే కోణంలో విశ్లేషణలు మొదలయ్యాయి. వర్ని మండలంలోని సిద్ధాపూర్ రిజర్వాయర్ పనుల పర్యవేక్షణకు వెళ్లిన సందర్భంలోనే పోచారం ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టు వద్ద నీటి నిల్వలు, సాగునీటి సరఫరాపై సమీక్ష జరిపిన ఆయన, పనులు ఎక్కడివక్కడ ఆగిపోవడంపై ఆగ్రహం చెందారు. సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం తాత్సారం చేయడం సరికాదని హితవు పలికారు. క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం కావాలంటే నిధుల విడుదల అత్యవసరమని, కానీ పాలనా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతు పక్షపాతిగా పేరున్న పోచారం, అన్నదాతల సమస్యల కోసం పోరాటానికి వెనకాడబోనని స్పష్టం చేశారు. మంత్రులు ప్రజా సమస్యల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని పోచారం పేర్కొన్నారు. తాను గతంలో పదవుల్లో ఉన్నప్పుడు అర్ధరాత్రి ఫోన్ వచ్చినా స్పందించి సమస్యలు తీర్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కనీసం ఫోన్ ఎత్తే సంస్కారం కూడా లేని వారు మంత్రి పదవుల్లో ఉండటం ప్రజలకు శాపమని ఘాటుగా విమర్శించారు. తన సీనియార్టీని గౌరవించకపోయినా పర్వాలేదు కానీ, ప్రజల అవసరాలను గుర్తించాలని సూచించారు. నిన్న మొన్న గెలిచిన వారితో తనను పోల్చుకోవద్దని, అనుభవం ఉన్న నేతలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించడం ద్వారా తన అసంతృప్తిని బహిరంగం చేశారు. అభివృద్ధి పనుల నిలిపివేత వెనుక పెండింగ్ బిల్లుల సమస్య ప్రధానంగా ఉందని పోచారం తెలిపారు. కాంట్రాక్టర్లకు చెల్లింపులు జరపకపోవడంతో వారు పనులు ముందుకు తీసుకెళ్లలేకపోతున్నారని చెప్పారు. పనులు ఆగిపోకుండా ఉండేందుకు ప్రజాప్రతినిధులు కాంట్రాక్టర్లను బతిమిలాడుకోవాల్సిన పరిస్థితి రావడం పాలనా వైఫల్యానికి పరాకాష్ట అని విమర్శించారు. వ్యవస్థలో లోపాలు సరిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, నిధులు విడుదల చేయకుండా కాలక్షేపం చేయడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటాయని హెచ్చరించారు. పాలనలో పారదర్శకత, వేగం లోపించాయన్నది ఆయన మాటల్లో స్పష్టమవుతోంది. సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణం ఈ ప్రాంత రైతులకు జీవనాడి వంటిదని పోచారం పేర్కొన్నారు. నిధులు లేక పనులు ఆగిపోతే రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన చెందారు. ఇప్పటికే సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు ప్రభుత్వం భరోసా ఇవ్వాల్సింది పోయి, నిర్లక్ష్యం ప్రదర్శించడం తగదన్నారు. రాజకీయాలకంటే తనకు ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని, దానికోసం ఎవరినైనా నిలదీస్తానని ప్రకటించారు. ఈ క్రమంలోనే ఆయన పార్టీ మారుతారనే ప్రచారం మరింత ఊపందుకుంది. సీనియర్ నేత జీవన్ రెడ్డి అధికార పార్టీని వీడిన నేపథ్యం పోచారం వ్యాఖ్యలకు మరింత బలాన్ని చేకూర్చింది. పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి హుందాతనానికి మారుపేరైన నేత ఇంత తీవ్రంగా స్పందించారంటే ప్రభుత్వంలో సమన్వయ లోపం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రవాణా రంగంలో మరోసారి అలజడి మొదలైంది. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులు సమ్మె బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. ఏప్రిల్ 22 నుంచి విధులను బహిష్కరించి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ఆర్టీసీ జేఏసీ అధికారికంగా ప్రకటించింది. ఇప్పటికే మార్చి 13న యాజమాన్యానికి, ప్రభుత్వానికి సమ్మె నోటీసులు అందజేసినా స్పందన కరువవడంతో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు కార్మిక నేతలు స్పష్టం చేశారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతోనే ముందుగా నోటీసులు ఇచ్చామని, చర్చలకు ప్రభుత్వం చొరవ చూపకపోవడమే ఈ సంక్షోభానికి కారణమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది మంది కార్మికుల భవిష్యత్తు ముడిపడి ఉన్న ఈ వివాదం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రధానంగా ఆర్టీసీని ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో విలీనం చేయాలన్నది కార్మికుల దశాబ్దాల కల. గతంలో ఇచ్చిన హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని జేఏసీ నేతలు విమర్శిస్తున్నారు. ఆర్టీసీని ఒక కార్పొరేషన్ స్థాయి నుంచి ప్రభుత్వ శాఖగా మార్చి, సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందుతున్న అన్ని రకాల ప్రయోజనాలు, సౌకర్యాలు తమకు కూడా వర్తించాలని కోరుతున్నారు. 32 ప్రధాన డిమాండ్లతో కూడిన నివేదికను ఇప్పటికే అధికారులకు సమర్పించారు. ముఖ్యంగా కార్మిక సంఘాల ఉనికిని కాపాడేందుకు సత్వరమే ఎన్నికలు నిర్వహించాలని జేఏసీ వైస్ ఛైర్మన్ థామస్ రెడ్డి పట్టుబట్టారు. ఎన్నికలు లేకపోవడం వల్ల కార్మికుల గొంతు నొక్కేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. జీతభత్యాల విషయంలో కూడా ఆర్టీసీ కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో వేతన సవరణలు జరుగుతున్నా, ఆర్టీసీలో మాత్రం పాత పద్ధతులే కొనసాగుతున్నాయని వారు వాపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పే స్కేల్ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 2021 వేతన సవరణను 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెరగకపోవడం వల్ల కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయని వారు గుర్తు చేస్తున్నారు. శ్రమకు తగ్గ ప్రతిఫలం దక్కనప్పుడు సమ్మె చేయడం మినహా మరో మార్గం లేదని కార్మికులు తెగేసి చెబుతున్నారు. మహాలక్ష్మి పథకం అమలు తీరుపై కూడా కార్మిక సంఘాలు కొన్ని అభ్యంతరాలను లేవనెత్తాయి. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం శుభపరిణామమే అయినా, ఆ పథకం వల్ల సంస్థకు కలిగే ఆర్థిక భారాన్ని ప్రభుత్వం సక్రమంగా భర్తీ చేయాలని కోరుతున్నారు. ఈ పథకం కింద ప్రతి నెలా అందాల్సిన సుమారు రూ.350 కోట్ల నిధులను ఎటువంటి కోతలు లేకుండా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. షరతులు విధించడం వల్ల క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, నిధుల విడుదలలో జాప్యం జరిగితే డీజిల్ కొనుగోలు, విడిభాగాల నిర్వహణ కష్టతరమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంస్థ మనుగడ సాగించాలంటే ఈ నిధుల సరఫరా నిరంతరం పారదర్శకంగా జరగాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశాన్ని జేఏసీ ఛైర్మన్ ఈదురి వెంకన్న తీవ్రంగా వ్యతిరేకించారు. కొత్త బస్సులను కొనుగోలు చేయడం మంచిదే అయినప్పటికీ, వాటిని అద్దె ప్రాతిపదికన తీసుకోవడం వల్ల సంస్థ నిర్వీర్యమవుతుందని ఆయన హెచ్చరించారు. ప్రైవేటు ఆపరేటర్ల ప్రమేయం పెరిగితే ఆర్టీసీ ఆస్తులు గుత్తేదారుల చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి నిర్వహించాలని డిమాండ్ చేశారు. లాభాపేక్ష కలిగిన ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి ప్రజా రవాణాను అప్పగిస్తే భవిష్యత్తులో సామాన్య ప్రయాణికులపై భారం పడుతుందని, ఉద్యోగ భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని వెంకన్న పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత తమ సమస్యలు తీరుతాయని ఆశించిన కార్మికులకు నిరాశే ఎదురైందని జేఏసీ నేతలు విమర్శిస్తున్నారు. గత రెండేన్నరేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై ప్రభుత్వం కనీస స్థాయిలో కూడా దృష్టి సారించలేదని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన విలీన హామీని అమలు చేసే దిశగా అడుగులు పడటం లేదని వారు భావిస్తున్నారు. ఆర్టీసీని బలోపేతం చేస్తామన్న నినాదాలు కేవలం ప్రచారానికే పరిమితం కాకూడదని, ఆచరణలో కార్మికుల సంక్షేమం కనిపించాలని కోరుతున్నారు. సమస్యలను గాలికొదిలేసి సంస్థను ఆధునీకరిస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందని కార్మిక సంఘాల ప్రతినిధులు ఎద్దేవా చేస్తున్నారు. కార్మిక శాఖ కార్యాలయంలో జరిగిన చర్చలు కూడా సఫలం కాకపోవడం సమ్మె నిర్ణయానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. లేబర్ డిపార్ట్మెంట్ అధికారులతో జేఏసీ నేతలు సమావేశమైనప్పటికీ, ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించలేదని తెలుస్తోంది. చర్చల పేరుతో కాలయాపన చేయడం వల్ల కార్మికుల్లో అసహనం పెరుగుతోందని నేతలు హెచ్చరించారు. ప్రభుత్వం మొండివైఖరి వీడి చర్చలకు పిలవాలని, సమస్యల పరిష్కారానికి ఒక కాలపరిమితిని నిర్ణయించాలని కోరారు. చర్చలు జరిపిన ప్రతిసారీ సానుకూలత వ్యక్తమవుతున్నా, అమలు విషయంలో మాత్రం శూన్యం అని వారు వాపోతున్నారు. ఈ వైఖరి మార్చుకోకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మె కారణంగా ప్రయాణికులకు ఎదురయ్యే అసౌకర్యానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. ఏప్రిల్ 22 నుంచి బస్సులు రోడ్డెక్కకపోతే రాష్ట్ర రవాణా వ్యవస్థ స్తంభించిపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా వేసవి సెలవులు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాలని కార్మికులు కోరుతున్నారు. సమ్మె అనేది తమ చివరి అస్త్రమని, తమ న్యాయమైన డిమాండ్ల కోసం తప్పనిసరి పరిస్థితుల్లోనే ఈ నిర్ణయం తీసుకున్నామని వారు వివరించారు. ప్రభుత్వం సామరస్యంగా వ్యవహరిస్తే సమ్మెను నివారించవచ్చని, లేదంటే పోరాటం ఆగదని హెచ్చరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్టీసీనే ఆధారం. అటువంటి కీలకమైన సంస్థలో పని చేసే కార్మికుల ఆవేదనను అర్థం చేసుకోవాలని జేఏసీ విజ్ఞప్తి చేస్తోంది. డ్రైవర్లు, కండక్టర్లు కనీస సెలవులు కూడా లేకుండా విధులు నిర్వహిస్తున్నారని, వారి శ్రమను గుర్తించాలని కోరుతున్నారు. సంస్థను ప్రైవేటీకరించే ఆలోచనను పూర్తిగా విరమించుకోవాలని, ప్రభుత్వ విలీన ప్రక్రియను వేగవంతం చేయాలని పట్టుబడుతున్నారు. ఈ పోరాటం కేవలం జీతాల కోసమే కాదు, తమ ఆత్మగౌరవం కోసమని కార్మికులు నినదిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కార్మిక సంఘాలతో చర్చలు జరిపి ఒక పరిష్కారాన్ని చూపాలని రవాణా నిపుణులు సూచిస్తున్నారు. మొత్తానికి తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగడంతో ఉత్కంఠ నెలకొంది. ఏప్రిల్ 22 లోపు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతుందనేది ఆసక్తికరంగా మారింది. కార్మికుల 32 డిమాండ్లపై సానుకూల నిర్ణయం వస్తుందా లేక ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందా అనేది చూడాలి. ఏదేమైనా రవాణా వ్యవస్థ స్తంభించిపోకుండా ఉండాలంటే ఉభయ పక్షాలు కూర్చొని చర్చించుకోవడమే ఉత్తమ మార్గం. ఆర్టీసీ మనుగడ, కార్మికుల భద్రత రెండూ రాష్ట్ర ప్రయోజనాలకు అవసరమే. సమ్మె దిశగా అడుగులు పడకముందే ఒక సామరస్య పూర్వక పరిష్కారం లభిస్తుందని ప్రయాణికులు ఆశిస్తున్నారు. పోరాటం ఆగదని జేఏసీ ప్రకటించిన నేపథ్యంలో, రానున్న రోజులు అత్యంత కీలకం కానున్నాయి.

# వరి కొనుగోలు కేంద్రానికి ప్రారంభించిన సర్పంచ్ ఆర్మూర్ లావణ్య

**విశాలభారతి, నవీపేట్ :** మండలంలోని బినోల సొసైటీ పరిధిలోని నాళేశ్వర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆర్మూర్ లావణ్య ఆధ్వర్యంలోవరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆర్మూర్ లావణ్య మాట్లాడుతూ తాము పండించిన వరి ధాన్యాన్ని, తాలు తప్ప లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ఏ గ్రేడ్ 2389, బి గ్రేడ్ 2369 మద్దతు ధర పొందాలని అన్నారు. అరుగాలం కష్టపడి పండించిన రైతులు తమ ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆర్మూర్ శ్రీనివాస్, సొసైటీ సెక్రటరీ రమేష్, మాజీ సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మండ్లు, మాజీ సర్పంచ్ సాయ రెడ్డి, నర్సింగ్ రావు, ద్యాగ సరీన్, మాజీ ఎంపిటిసి లక్ష్మణ్, గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## నర్సరీ స్థల కేటాయింపు కోసం వినతి

**తహసీల్దార్ గౌతమ్ కుమార్ వినతి పత్రం**



**మొయినాబాద్, విశాలభారతి:** మోత్కుపల్లి గ్రామపంచాయతి పరిధిలో నర్సరీ ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలంటూ గ్రామస్థులు ఎమ్మార్వోను వినతిపత్రం ద్వారా కోరారు. ప్రస్తుతం గ్రామంలో నర్సరీ ఏర్పాటు చేయడానికి తగిన స్థలం లేకపోవడంతో, మోత్కుపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 61లో ఉన్న మోత్కుపల్లి పల్లె ప్రకృతి వనం మరియు చందనగర్ పల్లె ప్రకృతి వనం మధ్యలో ఉన్న ఖాళీ స్థలాన్ని నర్సరీ కోసం అనుకూలంగా గుర్తించినట్లు తెలిపారు.ఈ విషయాన్ని గ్రామపంచాయతి సమావేశంలో చర్చించి, ఆ స్థలంలో నర్సరీ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. అనంతరం మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్ కుమార్ కలిసి, ఆ స్థలాన్ని అధికారికంగా గ్రామపంచాయతికి కేటాయించాలంటూ వినతిపత్రం సమర్పించారు.అలాగే, ప్రకృతి వనాల మధ్య ఉన్న ఈ స్థలాన్ని కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు అనధికారికంగా మార్గంగా వినియోగిస్తున్నారని గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై తగిన చర్యలు తీసుకోవాలని కూడా కోరారు.ఈ సందర్భంగా తహసీల్దార్ గౌతమ్ కుమార్ స్పందిస్తూ, సమస్యను పరిశీలించి పై అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు.

## ప్రభుత్వ భూముల సరిహద్దుల గుర్తించాలి



**మొయినాబాద్, విశాలభారతి:** నాగిరెడ్డి గూడ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూముల సరిహద్దులను గుర్తించాలంటూ గ్రామస్థులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామకంఠం పరిధిలో ఉన్న సర్వే నంబర్లు 1, 78, 79, 105కు చెందిన భూముల సరిహద్దులు స్పష్టంగా చూపించాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు తెలిపారు.ఈ విషయంపై గ్రామస్థులందరూ సమావేశమై, భూముల సరిహద్దులను అధికారికంగా గుర్తించాలనే నిర్ణయం తీసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం ద్వారా తహసీల్దార్ ఉత్తం కుమార్కు వినతిపత్రం అందజేశారు.ప్రభుత్వ భూముల పరిరక్షణ దృష్ట్యా సరిహద్దుల గుర్తింపు అత్యవసరమని గ్రామం తరపున కీసర పద్మ సంజీవ రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయంపై తగిన చర్యలు తీసుకుని సంబంధిత అధికారులను పంపించి సరిహద్దులు చూపించాలని వారు కోరారు.

## రోడ్డు మధ్యలో విద్యుత్ స్థంభం తొలగింపు

**స్థానికుల విజ్ఞప్తికి స్పందించిన విద్యుత్ శాఖ, తక్షణ చర్యలు**




**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్:** ఉమ్మడి హయత్ నగర్ పరిధిలోని మమ్మాయమ్మ గుడి దారిలో రోడ్డుమధ్యలో గత కొన్ని సంవత్సరాలుగా ఉన్న విద్యుత్ స్థంభం బస్తీ వాసులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. వాహన రాకపోకలకు అడ్డంకిగా నిలుస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న ఈ సమస్యపై స్థానికులు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. బస్తీ వాసుల అభ్యర్థన మేరకు ఈ సమస్యను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్ విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన హయత్ నగర్ ఎలక్ట్రిసిటీ ఏఈ తక్షణమే చర్యలు తీసుకుని పాత విద్యుత్ స్థంభాన్ని తొలగించి, అదే స్థలంలో మూడు అడుగులు వెనకకు కొత్త స్థంభాన్ని ఏర్పాటు చేశారు. దీంతో రహదారిపై ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గజ్జి భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించడంలో అధికారులు చురుకుదనం చూపడం అభినందనీయమని అన్నారు. త్వరితగతిన స్పందించి సమస్యను పరిష్కరించిన హయత్ నగర్ ఎలక్ట్రిసిటీ ఏఈకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## బిందెశ్వర్ ప్రసాద్ మండల్ వర్ధంతి నిర్వహణ

**ఆలోచన సాధన సమితి మాస్ ఆధ్వర్యంలో ఘన నివాళులు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్:** మన ఆలోచన సాధన సమితి మాస్ ఆధ్వర్యంలో మండల్ కమిషన్ అధ్యక్షుడు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి బిందెశ్వర్ ప్రసాద్ మండల్ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలోచన సాధన సమితి మాస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెదవుర బ్రహ్మయ్య హాజరై మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ.. బీసీల (OBC) హక్కుల కోసం నిరంతరం పోరాడిన గొప్ప నాయకుడు బిందెశ్వర్ ప్రసాద్ మండల్ అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలకు విద్య, వైద్యం, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫారసు చేస్తూ రూపొందించిన మండల్ కమిషన్ నివేదిక భారత రాజకీయ, సామాజిక రంగాల్లో కీలక మలుపుగా నిలిచిందన్నారు.సమానత్వంతో కూడిన న్యాయం అందరికీ దక్కాలని, అసమానతలను తొలగించేందుకు సామాజిక చైతన్యం అవసరమని నమ్మిన నాయకుడు మండల్ అని బ్రహ్మయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు దేవేందర్ జి, గుండ్ల ఆంజనేయులు, గుణగంటి చంద్రశేఖర్, దువ్వాళ శ్రీకాంత్, కైరంకొండ నర్సింగ్, దశరథ, వెంకటేష్, సైదులు, అస్మ, హర్షిత, ఆకాంక్ష, స్వప్న, శశికళ తదితరులు పాల్గొన్నారు.

## బస్ షెల్టర్స్ ఏర్పాటు చేయండి

**ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు**

**ఆర్టీసీ ఎండీ ని కలిసి కోరిన ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు**



**ముషీరాబాద్,విశాలభారతి:** నగరంలో బస్సు షెల్టర్ల దుస్థితి అధ్వానంగా ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమా జిల్లోజు అన్నారు. మండుతున్న ఎండలు కానరాని బస్ షెల్టర్లతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ బస్ షెల్టర్ల దుస్థితిపై ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు సోమవారం బస్సు భవన్లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శాఖల మధ్య సమన్వయ లోపంతో ప్రయాణికుల కష్టాలను వివరించారు. అనంతరం హేమా జిల్లోజు మాట్లాడుతూ ఆర్టీసీ జిహెచ్ఎంసి అడ్వర్టైజింగ్ ఏజెన్సీల మధ్య ఉన్న సమన్వయ లోపంతో సామాన్య ఆర్టీసీ ప్రయాణికులు ఇబ్బంది పడుతుంటే చోద్యం చూస్తున్నాయని మండిపడ్డారు. మరోపక్క బల్ షెల్టర్ వద్ద రోడ్ మ్యాప్ బోర్డులు, సమాచార బోర్డులు లేకపోవడంతో ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారానికి తెలిపారు. బస్ షెల్టర్ల వెనుక మలమూత్ర విసర్జన నిలిపివేసి శుభ్రపరచాలని డిమాండ్ చేశారు. అధికారులు త్వరగతిన స్పందించి క్షేత్రస్థాయిలో బస్సు షెల్టర్ లో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఈ నెల 20న భారీ నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఎండి ని కలిసిన వారిలో బుర్ర రాము గౌడ్, జావిద్ షరీఫ్, రమేష్, శ్రీనివాస్, రాకేష్ రెడ్డి, అజీమ్ మౌలాలి, ఇస్మాయిల్, ఆదాం, జైసింగ్ జాదవ్, ఎస్ ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండలో మిల్లర్ల అరాచకం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నల్లగొండ జిల్లాలో వరి సాగు చేసే రైతు పరిస్థితి ఇప్పుడు 'అడకత్తెరలో పోకచెక్క'లా మారింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి, పాలకుల నిర్లక్ష్యం తోడవ్వడం అన్నదాతను కుంగదీస్తోంది. జిల్లావ్యాప్తంగా సాగు లెక్కలు చూస్తే సంబరం కలుగుతున్నా, క్షేత్రస్థాయిలో విక్రయాల తీరు చూస్తే గుండె తరుక్కుపోతోంది. ఆకాశం వైపు చూస్తే అకాల వర్షాల భయం, భూమి వైపు చూస్తే మిల్లర్ల సిండికేట్ దోపిడీ.. వెరసి నల్లగొండ వరి రైతాంగం నిలువునా దగా పడుతోంది. పండించిన ప్రతి గింజనూ కొంటామని ప్రభుత్వాలు ఇచ్చే హామీలు కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో రైస్ మిల్లర్ల అరాచకాలు హద్దులు దాటుతున్నా, అడిగే నాథుడే లేకపోవడం శోచనీయం. జిల్లాలో యాసంగి సీజన్ పంట దిగుబడి అంచనాలను మించి వస్తోంది. దాదాపు 13.56 లక్షల ఎకరాల్లో రైతులు చెమటోడ్చి వరిని సాగు చేశారు. సుమారు 33 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని లెక్కలు చెబుతున్నా, ప్రభుత్వ యంత్రాంగం మాత్రం ఆ దిశగా అడుగులు వేయడం లేదు. సేకరించాల్సిన ధాన్యం లక్ష్యం భారీగానే ఉన్నా, అందుకు తగ్గట్టుగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోంది. వెయ్యికి పైగా కేంద్రాలు తెరవాల్సి ఉండగా, నేటికీ సింహభాగం కేంద్రాలు మూతపడే ఉన్నాయి. దీంతో రైతులు తమ ధాన్యాన్ని ఎక్కడ విక్రయించాలో తెలియక దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఇది కాస్తా ప్రైవేటు వ్యాపారులకు, మిల్లర్లకు వరంగా మారింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సకాలంలో అందుబాటులోకి రాకపోవడంతో మిల్లర్లు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. వారం రోజుల క్రితం వరకు క్వింటాల్‌కు రూ. 2800 వరకు పలికిన ధర, ఇప్పుడు ఒక్కసారిగా రూ. 2300లకు పడిపోయింది. క్వింటాల్‌కు ఏకంగా రూ. 400 నుంచి రూ. 500 వరకు కోత విధిస్తూ మిల్లర్లు తమ సిండికేట్ బలాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇది ఏదో ఒక ప్రాంతంలో జరుగుతున్న మోసం కాదు, జిల్లావ్యాప్తంగా ఒక వ్యూహం ప్రకారం సాగుతున్న దందా. అధికారులు పర్యవేక్షణ గాలికి వదిలేయడం వల్ల, మిల్లర్లు తామే రాజ్యమన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ధర నిర్ణయించే అధికారం ప్రభుత్వానిది కాదని, అది తమ సొంతమని వారు చాటి చెబుతున్నారు. ధాన్యం నాణ్యత విషయంలో మిల్లర్లు పెడుతున్న కొర్రీలు రైతులకు శాపంగా మారాయి. తేమ శాతం ఎక్కువగా ఉందనో, గింజ రంగు మారిందనో లేనిపోని సాకులు వెతుకుతున్నారు. తాలు గింజలు ఉన్నాయని సాకు చూపి తూకంలో కోతలు విధిస్తున్నారు. అసలే అకాల వర్షాల భయంతో ఉన్న రైతు, ధాన్యం తడిస్తే అసలుకే ఎసరు వస్తుందని భావించి మిల్లర్లు అడిగిన ధరకే పంటను కట్టబెడుతున్నాడు. ఈ భయాన్నే మిల్లర్లు పెట్టుబడిగా మార్చుకుంటున్నారు. గిట్టుబాటు ధర దక్కకపోయినా, కనీసం పెట్టుబడి అయినా చేతికి వస్తుందన్న ఆశతో రైతులు కన్నీళ్లను దిగమింగుకుంటున్నారు. అధికారుల మౌనం మిల్లర్లకు మరింత ఊతాన్ని ఇస్తోంది. ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. కేంద్రాలు ఎప్పుడు తెరుచుకుంటాయో, ఎప్పుడు కొనుగోలు చేస్తారో ఎవరికీ పట్టని పరిస్థితి. నిబంధనల పేరుతో సాగదీస్తూ రైతులను చుట్టూ తిప్పుకుంటున్నారు. అక్కడక్కడా ప్రారంభమైన కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. వర్షం వస్తే ధాన్యాన్ని కాపాడుకునేందుకు టార్పాలిన్ పట్టాలు కూడా ఉండటం లేదు. రైతులు తమ సొంత ఖర్చులతో పట్టాలు తెచ్చుకుని కుప్పల దగ్గర కాపలా కాయాల్సి వస్తోంది. రోజుల తరబడి కేంద్రాల వద్ద ఎదురుచూడలేక, వర్షాలకు ధాన్యం మొలకలెత్తుతుందన్న ఆవేదనతో రైతులు మిల్లుల బాట పడుతున్నారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు ఇప్పుడు ఎటుపోయాయో అర్థం కావడం లేదు. రైతుల పక్షాన నిలబడాల్సిన వారు మిల్లర్లతో లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తనిఖీలు చేయాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. మిల్లుల వద్ద జరుగుతున్న తూకం దోపిడీపై ఫిర్యాదు చేసినా స్పందన కరువైంది. ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో, దళారులు కూడా రంగంలోకి దిగి అల్ప ధరకే ధాన్యాన్ని కాజేస్తున్నారు. ప్రతి గింజనూ మద్దతు ధరకు కొంటామన్న మాట ఇప్పుడు నీటి మూటగా మారింది. నల్లగొండ జిల్లాలో వరి సాగు చేసిన ప్రతి రైతు ఇంట్లో ఇప్పుడు ఆందోళన నిండి ఉంది. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిన వారికి, చేతికొచ్చిన పంటను అమ్ముకోవడం పెద్ద యుద్ధంలా మారింది. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల ఒత్తిడి ఒకవైపు, మిల్లర్ల దోపిడీ మరోవైపు అన్నదాతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జిల్లాలో సుమారు 17 లక్షల టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నా, ఆచరణలో ఆ వేగం ఎక్కడా కనిపించడం లేదు. కేంద్రాల ఏర్పాటులో నిర్లక్ష్యం వల్ల రైతులు లారీ లోడ్లతో మిల్లుల ముందు బారులు తీరుతున్నారు. అక్కడ గంటల తరబడి నిరీక్షణ, చివరకు దక్కిన ధర చూసి గుండె చెరువవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొనుగోలు కేంద్రాలను ప్రతి గ్రామంలో అందుబాటులోకి తెచ్చి, కాంటాలను వెంటనే ప్రారంభించాలి. మిల్లర్ల సిండికేట్‌ను విచ్ఛిన్నం చేసేలా కఠినమైన నిబంధనలు అమలు చేయాలి. తక్కువ ధరకు కొనుగోలు చేసే మిల్లర్లపై లైసెన్సుల రద్దు వంటి చర్యలు తీసుకోవాలి. అధికారుల బృందాలు నిరంతరం మిల్లులను సందర్శిస్తూ, తూకంలో కోతలు లేకుండా చూడాలి. గిట్టుబాటు ధర కల్పించడంలో వైఫల్యం చెందితే, ఆ ప్రభావం భవిష్యత్ సాగుపై పడే ప్రమాదం ఉంది. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందన్న సూక్తిని పాలకులు గుర్తుంచుకోవాలి. తెలంగాణ అన్నపూర్ణగా పేరుగాంచిన నల్లగొండ జిల్లాలో రైతు కన్నీరు పెడితే అది రాష్ట్రానికే నష్టం. ధాన్యం సేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, రైతులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత పాలక పక్షంపై ఉంది. అకాల వర్షాల హెచ్చరికల నేపథ్యంలో, ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. టార్పాలిన్ పట్టాలు, గోనె సంచుల కొరత లేకుండా చూడాలి. మిల్లర్ల ఆగడాలను అదుపు చేయకపోతే, అన్నదాతలు ఆత్మహత్యల బాట పట్టే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, రైతుల కళ్లల్లో ఆనందం చూసేలా చర్యలు ఉండాలి.

## అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు ఘన నివాళి

**హస్తినాపురం డివిజన్ ఆధ్వర్యంలో బీజేపీ నేతల సందర్శన**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్:** నందనవనంలో కొత్తగా ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మరియు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా మరియు ఎల్బీనగర్ ఇంచార్జ్ సామ రంగారెడ్డి సందర్శించి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ.. నందనవనం ప్రజలు ఎంతో అభిమానంతో ఏర్పాటు చేసుకున్న ఈ విగ్రహాలను జిహెచ్ఎంసి లేదా పోలీస్ అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించవద్దని డిమాండ్ చేశారు. ఈ విగ్రహాలు స్థానిక ప్రజల్లో చైతన్యానికి, సామాజిక అభివృద్ధికి, సమరసతకు ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం డివిజన్ అధ్యక్షులు ఎరుకలి మల్లేష్ గౌడ్, బీజేపీ డివిజన్ సెక్రటరీ చంద్రకాంత్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ అంజి ముదిరాజ్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతికి కేంద్రంగా కొప్పుల నర్సింహా రెడ్డి..?

**మాన్సూరాబాద్‌లో మాజీ కార్పొరేటర్‌పై తీవ్ర ఆరోపణలు, విమర్శల వెల్లువ**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్:**

మాన్సూరాబాద్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డిపై అవినీతి ఆరోపణలు మళ్లీ తీవ్రంగా చర్చనీయాంశంగా మారాయి. గతంలో పలుమార్లు సాక్ష్యాలతో బయటపడ్డప్పటికీ, వాటిని రాజకీయ కోణంలో మలిచి నిజాన్ని కప్పిపుచ్చే ప్రయత్నాలు జరిగాయని స్థానిక వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇటీవల ఆయన సొంత పార్టీకి చెందిన కార్యకర్తలే ఈ వ్యవహారాలపై బహిరంగంగా మాట్లాడటం పరిస్థితి ఎంత దారుణంగా మారిందో స్పష్టంగా చూపిస్తోందని విమర్శకులు అంటున్నారు. నిజం నిప్పు లాంటిది... ఎంతకాలం దాచినా బయటపడుతుందనే వ్యాఖ్యలు ఇప్పుడు ప్రజల్లో వినిపిస్తున్నాయి. కొప్పుల నర్సింహా రెడ్డి పదవీకాలంలో అవినీతి ఒక వ్యవస్థలా మారిపోయిందని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి పని వెనుక లాభాల లెక్కలు, ప్రతి అనుమతిలో దందాలు, ప్రతి సమస్యలో వసూళ్లు సాధారణంగా మారిపోయాయని ఆరోపిస్తున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉన్న ప్రజాప్రతినిధి, అదే సమస్యలను ఆదాయ మార్గాలుగా మార్చుకోవడం పరిస్థితిని మరింత దిగజార్చిందని అంటున్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలకు మద్దతు, వసూళ్ల ఆరోపణలు, ప్రజలను ఇబ్బంది పెట్టే చర్యలు—ఇవి అన్నీ ఆయన పాలనలో సాధారణంగా మారిపోయాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజలు ఈ పరిణామాలను గమనిస్తూ ఉన్నారని, సమయం వచ్చినప్పుడు తగిన తీర్పు ఇస్తారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పై ఆరోపణలు సంబంధిత వర్గాల అభిప్రాయాల ఆధారంగా వెలువడినవే. అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

## వాహదారులు సురక్షితంగా ప్రయాణించాలి




**విశాలభారతి, గోదావరిఖని:**

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఇంద్ర నగర్ లో అరైవ్ లైవ్ కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని పట్టణంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి బి రామ్ రెడ్డి రామగుండం మేయర్ మహంకాళి స్వామి గోదావరిఖని ఏసిపి ఎం రమేష్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మేయర్ మాట్లాడుతూ.గంజాయి మరియు మత్తు పదార్థాల వినియోగంపై ఆందోళన వ్యక్తం చేశారు. యువత తప్పుడు మార్గంలో వెళ్లి కుటుంబాలను నష్టపరిచే పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఇందిరానగర్, సంజయ్ గాంధీనగర్ ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని పోలీసు వారు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. మన ప్రాంతం మారాలి, మనమే మారాలి అని అందరూ అనుకోవాలని ఇందిరానగర్, సంజయ్ గాంధీనగర్ ప్రాంతాలను అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. యువత విద్యపై దృష్టి పెట్టి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి కుటుంబాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా నిర్లక్ష్యమైన డ్రైవింగ్ చేస్తూ ప్రాణాలను కోల్పోయి గాయాలపాలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అన్నారు.డీసీపీ రామ్ రెడ్డి మాట్లాడుతూ. రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రాంగ్ రూట్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ ఉపయోగించడం వంటి చర్యలను పూర్తిగా నివారించాలని సూచించారు. ప్రజల సహకారం లేకుండా పోలీసుల ప్రయత్నాలు ఫలించవు. అందరూ కలిసి పనిచేస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చు అని తెలిపారు.పోలీసులు ఈ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గంజాయి రహిత ప్రాంతంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని డీసీపీ హామీ ఇచ్చారు.రామగుండం మున్సిపల్ 46వ డివిజన్ పోలీస్ ఆఫీసర్ రమేష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలు యువత అందరితో రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని, మిగతా వారితో పాటించేలా చేస్తామని ప్రమాద రైతు ప్రాంతంగా ఏర్పాటుకు తమ వంతు కృషి తప్పక చేస్తామని ప్రతిజ్ఞ చేపించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ ఈ అనూష, బ్లూ క్లోట్స్, పెట్రో కార్ సిబ్బంది, 46 వ డివిజన్ అధ్యక్షుడు అనిల్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దేవస్థానంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పూజలు

**అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహణ**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్:** మేడ్చల్ నియోజకవర్గంలోని కీసర మండలం పరిధిలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ చీర్యాల లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో జరుగుతున్న అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఇబ్రహీం పట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పురోహితులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భక్తులందరూ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో తారామతిపేట్ గ్రామ మాజీ సర్పంచ్ మూల మహేష్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## దళిత రత్నకు సత్కారం



**సికింద్రాబాద్, విశాలభారతి:** దళిత రత్న పురస్కారానికి ఎంపికైన సీతాఫలమండీ కి చెందిన బీ. ఆర్. ఎస్. నేత గరిగ పోగుల. చంద్రశేఖర్ ను సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ సత్కరించారు. సీతాఫలమండీ లోని ఏం. ఎల్. ఏ. క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

## శంకర్‌పల్లి గురుకుల కళాశాలలో 100శాత ఫలితాలు

**ప్రిన్సిపాల్ శ్రీమతి కృష్ణవేణి అభినదనల వెల్లువ**




**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ లోని టి.జి.ఎస్.డబ్ల్యూ. ఆర్.యస్ శంకర్‌పల్లి కళాశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన బైపీసీ రెండో సంవత్సరం విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి విశేష ప్రతిభ కనబరిచారు. ప్రతి విద్యార్థి విజయాన్ని సాధించడం కళాశాల నాణ్యమైన బోధనకు నిదర్శనమని ప్రిన్సిపాల్ శ్రీమతి కృష్ణవేణి తెలిపారు. ఉపాధ్యాయుల సమిష్టి కృషి, విద్యార్థుల కృషి ఫలితంగా ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేసిన ప్రిన్సిపాల్, అత్యుత్తమ మార్కులు సాధించిన టాపర్లను ప్రత్యేకంగా ప్రశంసించారు.విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

## అంబేద్కర్ విగ్రహాలను శుద్ధి చేసిన బిజెపి నేతలు

**సికింద్రాబాద్, విశాలభారతి :** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు భారతీయ జనతా పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ పలు డివిజన్లో శుద్ధి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన స్వతంత్ర ఫలాలు రాజ్యాంగాన్ని ఈరోజు అందరం స్వేచ్ఛగా జీవిస్తున్నామని భవిష్యత్తులో అంబేద్కర్ కలలను సహకారం చేసుకోవాలని బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో అంబేద్కర్ ఆశయాల కోసం చిట్టా చివరి అంత్యోదయ పథకాలను అందించాలనే ఉద్దేశం ప్రధాని లక్షణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నరేష్, హరి నాగేశ్వరరెడ్డి, రాజేశ్వరరావు, కుమారస్వామి, సంపత్, ప్రతాప్ కుమార్, రమేష్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, భైరి సురేష్, రాజ్ కుమార్, భాస్కర్ గౌడ్, చిన్న, సురేష్ ముదిరాజ్, శ్యాము ముదిరాజ్, తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# మెట్టు హత్య కేసులో నిందితుడి అరెస్ట్



**నిజామాబాద్, విశాలభారతి:** మాక్లూర్ మండలం మెట్టు గ్రామానికి చెందిన ఆంటోని మెట్టు గ్రామ శివారులోని పార్క్ సమీపంలో ఆదివారం గాయాలతో మృత దేహంగా కనిపించగా,వెంటనే హత్య కేసు నమోదు చేయబడింది.నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాజశేఖర్, మొగులయ్యలు విచారణ ప్రారంభించారు. విచారణలో భాగంగా మెట్టు గ్రామానికి చెందిన అనుమానితుడు ఫ్రాన్సిస్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా,శుక్రవారం 10వ తేదీ రాత్రి తాను మరియు అంటోని కలిసి మద్యం సేవిస్తున్న సమయంలో అంటోని తనను దూషించడంతో ఇద్దరి మధ్య గొడవ చోటుచేసుకున్నట్లు వెల్లడించాడు.ఆ గొడవలో ఫ్రాన్సిస్ రాయితో అంటోని తలపై బలంగా కొట్టడంతో అతనికి తీవ్ర గాయాలు కలిగాయి. అనంతరం అతన్ని కొంత దూరం ఈడ్చుకుంటూ వెళ్లినట్లు తెలిపాడు. ఈ ఘటనలో గాయాల వల్ల ఆంటోని అక్కడికక్కడే మృతి చెందగా, ఫ్రాన్సిస్ ఎవరికీ అనుమానం రాకుండా అక్కడి నుండి పరారయ్యాడు. సోమవారం అతని ఇంటి వద్ద పట్టుకుని విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుని వద్ద నుండి బండరాయి, దుస్తులు స్వాధీనం చేసుకుని అతనిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు నార్త్ రూరల్ సిఐ శ్రీనివాస్ తరలించారు.

# ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఇంచార్జిగా డాక్టర్ నాగమోహన్



**నిజామాబాద్, విశాలభారతి:** నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇంచార్జ్ గా డాక్టర్ నాగమోహన్ బాధ్యతలు చేపట్టినందుకు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, సూపరింటెంట్ నాగరాజ్ తో పాటు సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# హెల్మెట్ లేకుంటే గ్రామానికి ప్రవేశం లేదు

- **సుర్వి మల్లేష్ గౌడ్ సర్పంచ్**



**చౌటుప్పల్, విశాలభారతి:** మండలం అంకిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజా పాలన ప్రత్యేక ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రోడ్డు భద్రత వారోత్సవాల కార్యక్రమం చౌటుప్పల్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నర్సిరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి అంకిరెడ్డిగూడెం సర్పంచ్,సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు సుర్వి మల్లేష్ గౌడ్ పాల్గొని అనంతరం వారు మాట్లాడుతూ..రోడ్డు భద్రత గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. రోడ్డు భద్రత కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, హెల్మెట్ లేకుంటే గ్రామానికి ప్రవేశం లేదని ఈ సందర్భంగా గ్రామస్తులకు మరియు యువకులకు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్,పాలకవర్గ సభ్యులు పంచాయతీ కార్యదర్శి గ్రామస్తులు,తదితరులు పాల్గొనడం జరిగింది.

# మన గ్రోమోర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం రామరాజుపల్లి గ్రామంలో మన గ్రామోర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు మహిళలు పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ మన గ్రోమోర్ సెంటర్స్ ఏరియా మేనేజర్ ఆపరేషన్స్ సందు సురేష్, ఏరియా మార్కెటింగ్ మేనేజర్ జానకయ్య మాట్లాడుతూ, రైతు కుటుంబాలు ఆరోగ్య భీమా పథకాలను తప్పనిసరిగా వినియోగించుకోవాలని, సూచించారు. శిబిరంలో పాల్గొన్న వైద్యులు గ్రామంలోని 55 మందికి బీపీ పల్స్ రేటు 20 ప్రాథమిక పరీక్షలు నిర్వహించి దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన సుమారు 20 రకాల మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మన గ్రోమోర్ సింగరాజుపల్లి మేనేజర్ రమేష్ మాట్లాడుతూ, ఈ ఆరోగ్య భీమా పథకం ద్వారా రైతులకు సంవత్సరం పాటు ఉచిత డాక్టర్ సంప్రదింపులు 28 రకాల మందులు ప్రాథమిక వైద్య పరీక్షలు ప్రైవేటు ఆసుపత్రిలో డిస్కౌంట్ అలాగే ప్రమాద భీమా వంటి సదుపాయాలు అందుబాటులో ఉంటాయని, తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణ గ్రామ సర్పంచ్ బోయిని మహేష్ రైతులు తుకారాం, సురేష్, మల్లయ్య, సంపత్ రెడ్డి, కుమార్, మరియు గ్రామ మహిళలు రైతులు పాల్గొన్నారు.

# నిర్మల పాఠశాల విద్యార్థులకు గోల్డ్ మెడల్స్



**దేవరుప్పుల, విశాలభారతి:** జాతీయ నాయకుల వేషధారణలో భాగంగా వివేకానంద టీచర్స్ అసోసియేషన్ నిర్వహించిన ఆన్లైన్ పోటీలో నిర్మల హరిజన కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్స్, ప్రశంసా, పత్రాలు వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాలను బహుమతులుగా గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివగారి కిరణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి పల్లెర్ల సంధ్యారాణినవీన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, అంగన్వాడీ పిల్లలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జాతీయ నాయకుల వేషధారణ ఆన్లైన్ ఫోటో పోటీలో నిర్మల హరిజన కాలనీకి పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్, ప్రశంస పత్రాలు సాధించడం ఎంతో గర్వకారణం అని పేర్కొన్నారు. ఈ విజయానికి కృషిచేసిన ప్రధానోపాధ్యాయుడు కిరణ్ కుమార్, అంగన్వాడీ ఉపాధ్యాయులు నిర్మల, లక్ష్మి,ని అభినందించారు. చిన్న పాఠశాల అయినప్పటికీ పెద్ద స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు.

# రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన అవసరం

- **డిసిపి రాజమహేంద్ర నాయక్**





**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం సింగరాజుపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈరోజు రోడ్డు భద్రత వారోత్సవాలలో గ్రామ సర్పంచ్ కొండ ఊర్మిళా మల్లారెడ్డి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా డీసీపీ (డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్) బి. రాజ మహేంద్ర నాయక్ దేవరప్పుల స్థానిక ఎస్సై ఊర సృజన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. వాహనాలు నడిపించేటప్పుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి, హెల్మెట్, సీట్ బెల్ట్, వినియోగం ప్రాణాలకు కాపాడుతుందని, పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, వేగ పరిమితులు పాటించాలని, సూచించారు. గ్రామ ప్రజలు యువత రోడ్డు భద్రతపై మరింత జాగ్రత్తగా ఉండాలని చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రాణాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు యువకులు గ్రామపంచాయతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గోల్డెన్ అవర్‌లో ప్రాణాలు కాపాడవచ్చు

- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**
- **పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**విశాలభారతి, పెద్దపల్లి :** చిన్న నిర్లక్ష్యపు చర్యల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.సోమవారం సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గర్రెపల్లి గ్రామంలో సర్పంచ్ వీరగోని రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జరిగిన 'అరైవ్-అలైవ్' కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష హాజరయ్యారు.కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో గాయపడి అంగవైకల్యం చెందినా లేదా మరణించినా,ఆ వ్యక్తిపై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'ను సద్వినియోగం చేసుకుంటే ప్రాణాలను రక్షించవచ్చని తెలిపారు. హిట్ అండ్ రన్ కేసులు మరియు ఇతర రోడ్డు ప్రమాదాల్లో బాధితులకు ప్రభుత్వం రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నదని చెప్పారు.రాష్ట్రంలో రోజురోజుకు రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతుండగా, అనేక మంది అంగవైకల్యం చెందడం, మరణించడం జరుగుతుందని తెలిపారు.ప్రమాదాల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటూ, పోలీస్,రవాణా,రోడ్డు శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ భద్రతా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.గత సంవత్సరం జిల్లాలో సుమారు 30 మంది బాధితులకు ఈ సహాయం అందించినట్లు పేర్కొన్నారు.రోడ్డు ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలిస్తే పోలీస్ కేసుల్లో చిక్కుకుంటామనే అపోహలు అవసరం లేదని స్పష్టం చేశారు. బాధితులను ఆసుపత్రికి తరలించిన వారికి 'రహవీర్ పథకం' కింద రూ.25,000 ప్రోత్సాహకం అందజేస్తామని తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత మొదటి గంటను 'గోల్డెన్ అవర్'గా పరిగణిస్తూ, ఈ సమయంలో సరైన వైద్యం అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు.ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు ఉచిత చికిత్స అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ భషిరోద్దీన్,ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు సుబ్బారెడ్డి, అనిల్ కుమార్, ఎస్సై చంద్రకుమార్, ఎంవీఐ మధు, సంబంధిత పోలీస్,ట్రాఫిక్,ఎంవీఐ సిబ్బంది,అధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత..!

- **ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి**
- **మాక్లూర్ ఎస్సై రాజశేఖర్**
- **అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్ పెక్టర్ సాగర్**



**నిజామాబాద్, విశాలభారతి :** రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని మాక్లూర్ ఎస్సై రాజశేఖర్,అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్ పెక్టర్ సాగర్ అన్నారు.ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో 'అరైవ్ అలైవ్' అనే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో వేలాదిమంది ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రతి ఒకరూ రూల్స్ పాటిస్తూ..కుటుంబ సభ్యులు,ఇతరులు కూడా రూల్స్ పాటించేలా కృషి చేయాలని తెలిపారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలను వివరించి, కుటుంబాలను కోల్పోయిన బాధితుల ఆవేదనను వెల్లడించారు.రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టాన్ని తగ్గించడంలో హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి తమ ప్రాణ భద్రతను కాపాడుకోవాలని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని అన్నారు.కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన రవాణా శాఖ చట్టాలను వివరించారు.రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తే నగదు తో పాటు ప్రశంస పత్రం అందించనున్నట్లు తెలియజేశారు. ఇందులో గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర రావు,ఇంచార్జ్ ఎంపీఓ రాకేష్, ఉప సర్పంచ్ ఆరీఫ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయం ఎస్ఐ శేఖర్

- **వాహదారులు సురక్షిత ప్రయాణంతో ప్రాణాలతో ఇంటికి చేరుకోవాలి**
- **అని రోడ్డు భద్రతపై పోలీసుల అవగాహన కార్యక్రమం**




**అడవిదేవులపల్లి, విశాలభారతి:** నల్గొండ జిల్లా ఎస్పీ ఆదేశానుసారం,రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం అడవిదేవులపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అడవిదేవులపల్లి ఎస్ఐ శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై గ్రామస్తులకు, వాహనదారులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ప్రాణ రక్షణ కవచమని ఎస్ఐ సూచించారు.మైనర్ డ్రైవింగ్ చేసే పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలని,మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వరాదని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపరాదని,ప్రాణాల కంటే ఏదీ ముఖ్యం కాదని,మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రమాద రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ శేఖర్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బిల్లకంటి రేణుక నరసింహారావు, గ్రామపంచాయతీ కార్యదర్శి దుర్గయ్య,వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి



- **ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి**

**నిజామాబాద్, విశాలభారతి:** నిజామాబాద్ జిల్లా మా క్లూర్ మండలం ఒడ్యాట్ పల్లి గ్రామంలో 2000 సంవత్సరంలో గ్రామపంచాయతీ పాలక వర్గం గ్రామంలోని నిరుపేదలకు ప్రభుత్వ స్థలంలో ఇళ్ల స్థలాలను కేటాయించింది ఆరు సంవత్సరాలు కడుతున్న ఇవ్వకపోవడం సిగ్గుచేటని అన్నారు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ మాట్లాడుతూ సుమారు 19 మంది నిరుపేదలకు ఇండ్ల స్థలాలను గ్రామపంచాయతీ తీర్మానం చేసింది నిరుపేదలైనటువంటి ఎస్సీ బీసీ చెందినవారు నిరుపేదలు ఉన్నారని అన్నారు గ్రామపంచాయతీ పాలకవర్గం కేటాయించిన ఇండ్ల స్థలాలో గుడిసెలు వేసుకుండంగా అప్పటి రెవెన్యూ అధికారులు పంచాయతీ పాలకవర్గం కేటాయించిన ఇండ్ల స్థలాలు ఇంటి నిర్మాణాలు అడ్డుకున్నారు అప్పటి రెవెన్యూ అధికారులు ఉన్నత అధికారులతో మాట్లాడి ఇండ్ల స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు ఆరు సంవత్సరాలు గడిచిన నేటికి వారికి ఇచ్చిన హామీని నెరవేరు లేదు బాధితులు అదే గ్రామంలో సర్వేనెంబర్ 40లో 2020లో ఓడ్యాట్ పల్లి గ్రామపంచాయతీ పాలక వర్గం తీర్మానం చేసింది ఇండ్ల స్థలాలు ఇవ్వాలని నిరుపేదలైనటువంటి వారికి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం భూమిలేని వారికి భూమి ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టివ్వాలని ఈ సందర్భంగా కలెక్టర్ ను కోరడం జరిగింది కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తారని అన్నారు ఈ కార్యక్రమంలో 19 మంది బాధితులు పాల్గొన్నారు

# దుద్దిళ్ల శ్రీపాద రావుకి నివాళులు

- **ఎమ్మెల్యే మక్కాన్ సింగ్**



**విశాలభారతి, గోదావరిఖని:** పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సోమవారం రోజున స్థానిక గోదావరిఖని బస్టాండ్ ఎదురుగా నిర్వహించిన దుద్దిళ్ల శ్రీపాద రావు 27 వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత, సేవా మార్గాన పయనించిన మహోన్నత వ్యక్తి శాసనసభ మాజీ స్పీకర్, దివంగత నేత దుద్దిళ్ల శ్రీపాద రావు అని గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో రామగుండం మేయర్ మహంకాళి స్వామి,డిప్యూటీ మేయర్ ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, శ్రీపాద రావు అభిమానులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీపాద రావు చూపిన మార్గంలో ముందుకు సాగాలి

- **ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్**



**విశాలభారతి, మంథని:** మంథని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు 27వ వర్ధంతి సందర్భంగా సోమవారం మంథని పట్టణ కేంద్రంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. శ్రీపాద కాలనీలో ఏర్పాటు చేసిన దుద్దిళ్ల శ్రీపాద రావు నూతన విగ్రహాన్ని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ తో కలిసి పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీపాద రావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన ప్రజాసేవలను స్మరించుకుంటూ, శ్రీపాద రావు చూపిన మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన లలిత్ కుమార్



**విశాలభారతి, గోదావరిఖని:** సోమవారం నాడు ఆర్.జి1 ఏరియా జి.డి.కె. నెం. 2 & 2ఏ ఇంక్లైన్ గని నందు పలు అభివృద్ధి ప్రారంభోత్సవాలలో ఆర్జీ.1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి గని అధికారులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మొదట జిడికె 2 ఇంక్లైన్ నందు శ్రీ దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకొని ఆలయంలో పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా జిడీకే 2 ఇంక్లైన్ నందు మౌలిక సదుపాయాలలో భాగముగా ఉద్యోగుల సౌకర్యార్థం రెండవ R.O వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం చేశారు. తదుపరి అండర్ గ్రౌండ్ సెమీ మెకానైజ్డ్ మైనింగ్ మోడల్ ప్రదర్శనకు సంబంధించిన సాంకేతిక నైపుణ్యత మోడల్ ను ఆవిష్కరించారు. ఆలాగే అదే గనిలో ఉద్యానవనమును రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. జిడికె 2ఏ గని నందు నూతనంగా నిర్మించిన 4వ స్యాండ్ బంకర్ ప్రారంభోత్సవం చేశారు. ఇంకా ఈ కార్యక్రమములో యస్ ఓ టు జియం కె. చంద్రశేఖర్, ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, జిడికె కోల్ మైన్ (2&2A & 5) పివో డి.రమేష్, డిజియం సివిల్ KDN వరప్రసాద్, స్టాట్యూటరి మేనేజర్ డి.రమేష్ బాబు, గని మేనేజర్ షైక్ అల్లాఉద్దిన్, ఎఐటియుసి అడిషినల్ మేనేజర్ మాత్యు జాన్సన్, సెక్షన్ ఇంచార్జ్ దొంత వెంకటేశ్వర్లు, రావుల దామోదర్, మరియు సల్మాన్, సంక్షేమాదికారి డి.గణేష్, అధికారులు, ఫిట్ సెక్రటరిలు పొన్నాల వెంకటయ్య, మరియు కారంపూడి వెంకన్న, వర్క్ మేనే ఇన్స్ పెక్టర్స్ మరియు ఉద్యోగులు తదితరులు పాల్గోన్నారు.

# ప్రజావాణికి 124 ఫిర్యాదులు



**నిజామాబాద్, విశాలభారతి:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 124 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో పాటు సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్నలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఫైర్ టెండర్ ప్రారంభోత్సవం




**విశాలభారతి, ఎన్‌టిపిసి:** ఫైర్ స్టేషన్ యొక్క అగ్నిమాపక భద్రత మరియు అత్యవసర ప్రతిస్పందన సామర్థ్యాలను బలోపేతం చేస్తూ, తెలంగాణలోని రామగుండం ఆర్ఎస్‌టిపిఎస్ సిఐఎస్ఎఫ్ యూనిట్‌లో 13 ఏప్రిల్ 2026న ఒక కొత్త ఫైర్ టెండర్‌ను ప్రారంభించారు.సిఐఎస్ఎఫ్ యూనిట్ (ఆర్&టి) కమాండెంట్ నవనీత్ కౌర్ సమక్షంలో, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆర్&టి) శ్రీ చందన్ కుమార్ సమంత ఈ ఫైర్ టెండర్‌ను లాంఛనంగా ప్రారంభించారు.ఈ కొత్త ఫైర్ టెండర్‌ను చేర్చడం అనేది, ప్లాంట్ ప్రాంగణంలో భద్రతా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి మరియు అగ్నిప్రమాద సంబంధిత అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సంసిద్ధతను నిర్ధారించడంలో ఒక ముఖ్యమైన ముందడుగు. ఈ చొరవ, అత్యున్నత భద్రతా ప్రమాణాలను మరియు కార్యాచరణ నైపుణ్యాన్ని కొనసాగించడంలో ఎన్‌టిపిసి యొక్క నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తుంది అని తెలియజేసారు.

# ఉపాధి హామీ కూలీలను కలిసిన మనాలి ఠాగూర్



**విశాలభారతి, పాలకుర్తి:** పాలకుర్తి మండలం పాలకుర్తి గ్రామంలో 100 రోజుల ఉపాధి హామీ కూలీలను కలుసుకుని వారి పనితీరు, సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలతో ముచ్చటిస్తూ వారి కష్టాలను అర్థం చేసుకుని, అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.అదే సమయంలో కూలీలకు క్యాప్స్ పంపిణీ చేసి, ఎండలో పనిచేస్తున్న వారికి అవసరమైన సహాయాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్, నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగ పీఠిక పుస్తకావిష్కరణ



**సికింద్రాబాద్, విశాలభారతి :** భారత రాజ్యాంగం సామజిక న్యాయం భారత రాజ్యాంగ పీఠిక పుస్తకావిష్కరణ సెమినార్ లో భాగంగా నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి తో కలిసి పుస్తక ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వారిలో దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరుడు కృష్ణ, మహనీయుల ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్ మండల సురేందర్ , ప్రధాన కార్యదర్శి మొగిలిపాక పరశురాం , అంబేద్కర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ బహదూర్ పాల్గొన్న వారిలో ఉన్నారు.

## 317 జీవో ఉద్యోగుల పాలిట శాపం: ఆర్ కృష్ణయ్య



**ముషీరాబాద్, విశాలభారతి:** 317 జీవో అర్థంపర్థం లేని జీవో అది ఒక పీడకల అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య అన్నారు. ఆ జీవో ఉద్యోగ దంపతులకు పాలిట శాపంగా మారిందని పేర్కొన్నారు. సోమవారం విద్యానగర్ బిసి భవన్ లో జీవో 317 బాధితులకు జీవో 190 ద్వారా తాత్కాలిక బదిలీలు డిప్యూటేషన్ ఇవ్వాలని కోరుతూ ఉద్యోగ సంఘాల నాయకులు బి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరుతూ ఆర్.కృష్ణయ్య కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఒకే కుటుంబంలో భార్యాభర్తలు వందల కిలోమీటర్ల దూరంలో ఉంటూ ఉద్యోగాలు చేస్తున్నారని వారికి న్యాయం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని మంత్రులతో సబ్ కమిటీ వేసి న్యాయం చేస్తున్నారని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలో జీవో నెంబర్ 190 ను అమలు చేసి ఉద్యోగులకు తాత్కాలిక బదిలీలు డిప్యూటేషన్ చేయాలని కోరారు. ప్రభుత్వ సబ్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా దరఖాస్తు చేసుకున్న బాధితులు అందరికీ జీవో 190 ద్వారా దరఖాస్తులను పరిష్కరించి ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అలానే రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా అభివృద్ధి చేయాలని అందుకు వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నారాయణ, జ్ఞానేశ్వర్, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, రఘునందన్, చంద్రకళ, జయమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో దివ్యాంగులకు పరికరాల పంపిణీ

**ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మహిళా సంఘ భవనంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పియుస్ మిట్టల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సీఎస్ఆర్ నిధులతో, అలింకో సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ పరిధిలోని వికలాంగులు మరియు దివ్యాంగులకు అవసరమైన పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా లబ్ధిదారుల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యం పెంపొందించేందుకు కృషి చేశారు. పరికరాలు పొందిన లబ్ధిదారులు సంస్థతో పాటు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారికి మరియు బీజేపీ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ పార్టీ ఎల్లప్పుడూ తమకు అండగా ఉంటుందని నాయకులు హామీ ఇస్తూ కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు, మోర్చా నాయకులు, స్థానిక కార్యకర్తలు మరియు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## బౌద్ధ నగర్ లో ఉచిత కంటి వైద్య శిబిరం



**సికింద్రాబాద్, విశాలభారతి:** బౌద్ధ నగర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మంద జగన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. సంఘ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఇందులో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమున్న వారికి ఆపరేషన్ ఆపరేషన్ కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో బౌద్ధ నగర్ పద్మశాలి సంఘం సభ్యులు ఆనందసు కర్ణాకర్, చింతకింది సాయి కిరణ్, తౌటం సతీష్, తిరుమల రవి,కర్నాటి ఆనంద్ కుమార్, దిండిగాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనాన్ని అడ్డగించి డ్రైవర్‌పై దాడి

- **నలుగురిపై కేసు నమోదు .. వివరాలు వెల్లడించిన ఎస్సై**

**పాల్వంచ విశాలభారతి:** పాల్వంచ మండల పరిధిలో వాహనాన్ని అడ్డగించి డ్రైవర్‌పై దాడి చేసిన ఘటనలో సోమవారం నలుగురు వ్యక్తులపై పోలీసులు కేసునమోదు చేశారు. రూరల్ ఎస్ఐ బి. సురేష్ తెలిపిన వివరాల ప్రకారం, బీహార్‌కు చెందిన ఐచర్ వాహనంలో పూసల తండాకు గేదలను డైరీ ఫామ్‌కు తరలిస్తున్న సమయంలో పాలకోయ తండాకు చెందిన కొంతమంది వ్యక్తులు పాల్వంచ అంబేద్కర్ సెంటర్ నుంచి వాహనాన్ని వెంబడించారు. అనంతరం కోడిపుంజుల వాగు వద్ద వాహనాన్ని అడ్డగించి డ్రైవర్ విక్రమ్ కుమార్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వివరించారు

## వీరునాయక్ తండాలో చెత్త సమస్య తీవ్రం

- **కుండీల ఏర్పాటు కోరుతూ వినతి**



**పాల్వంచ విశాలభారతి:** పాల్వంచ మండలం బసవతారక కాలనీ గ్రామ పంచాయతీ పరిధిలోని వీరునాయక్ తండాలో చెత్త నిర్వహణ లోపాలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ సమస్యపై స్థానికుడు నునావత్ ప్రసాద్ గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందించారు. గ్రామంలో వెంటనే చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని కోరారు. వీరునాయక్ తండా చివరి వీధి ఎదురుగా రహదారి పక్కన చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల ఆ ప్రాంతం పూర్తిగా డంపింగ్ యార్డుగా మారిందని తెలిపారు. ఈ పరిస్థితుల కారణంగా దోమల పెరుగుదల అధికమై ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని చెత్త పేరుకుపోవడంతో తీవ్రమైన దుర్వాసన వ్యాపించి అస్వచ్ఛ వాతావరణం నెలకొంటోందని వివరించారు. వర్షాకాలంలో మోరీలు మూసుకుపోయి పలుమార్లు నీటి నిల్వ సమస్యలు తలెత్తిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సీతానగర్ కాలనీ, బసవతారక కాలనీ, వీరునాయక్ తండాలో వీధులు సన్నగా ఉండటంతో ట్రాక్టర్ రాకపోవడం ప్రధాన సమస్యగా మారిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ప్రతి వీధికి అనువైన ప్రదేశాల్లో చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని, వాటిలో సేకరించిన చెత్తను వారానికి కనీసం నాలుగు సార్లు ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడాన్ని నియంత్రించవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమస్యను ప్రజారోగ్యానికి సంబంధించిన అత్యవసర అంశంగా పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని నునావత్ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. గ్రామంలో పరిశుభ్ర వాతావరణం కల్పించడం సంబంధిత అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు.

# పోచారం పరిస్థితిని అర్థం చేసుకోవాలి

- **బీఆర్ఎస్ వల్ల రూ.8 లక్షల కోట్ల భారం**
- **నెలకు రూ.7 వేల కోట్లు కడుతున్నాం**
- **సలహాదారుగా పోచారానికి అన్నీ తెలుసు**
- **అందుకే బిల్లుల విడుదల ఆలస్యమవుతోంది**
- **పెద్ద మనసుతో సహకరించాలని కోరారు**



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెను దుమారం రేపుతున్నాయి. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎన్నడూ చూడని పరిస్థితులను ఇప్పుడు ఎదుర్కొంటున్నానని ఆయన బాహాటంగానే అసంతృప్తి వెళ్లగక్కారు. నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు విడుదల కాకపోవడం, బిల్లులు రాక కాంట్రాక్టర్లు పనులు వదిలేసి వెళ్తుండటంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సిద్ధాపూర్ రిజర్వాయర్ వద్ద ఆయన చేసిన వ్యాఖ్యలు అధికార పక్షంలో కలకలం సృష్టించాయి. ముఖ్యమంత్రికి, మంత్రులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందన లేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో సైతం హాట్ టాపిక్‌గా మారాయి. పోచారం శ్రీనివాస్ రెడ్డి లాంటి నిబ్బరమైన నాయకుడు ఇలా రోడ్డుపైకి వచ్చి నిరసన తెలపడం వెనుక ఉన్న తీవ్రతను రాజకీయ విశ్లేషకులు గమనిస్తున్నారు. సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్న తనకే కనీస గౌరవం దక్కడం లేదని, నిధుల కోసం మంత్రుల కాళ్లు మొక్కాలా అని ఆయన ప్రశ్నించడం ప్రభుత్వ పనితీరుపై చర్చకు దారితీసింది. పనుల బిల్లులు సకాలంలో రాకపోవడంతో క్షేత్రస్థాయిలో ప్రజలకు సమాధానం చెప్పుకోలేకపోతున్నామని ఆయన వాపోయారు. అభివృద్ధిని ఆకాంక్షించే నాయకుడిగా తన నియోజకవర్గ ప్రయోజనాల కోసం ఆయన పడుతున్న తపన ఈ వ్యాఖ్యల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తక్షణమే స్పందించారు. నిజామాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న ఆయన, పోచారం వ్యాఖ్యలపై వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం అత్యంత క్లిష్ట దశలో ఉందని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాల వల్ల రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని, దాదాపు 8 లక్షల కోట్ల రూపాయల అప్పుల భారాన్ని తమ ప్రభుత్వంపై మోపి వెళ్లారని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఈ భారీ అప్పుల వల్ల రాష్ట్ర ఆదాయంలో మెజారిటీ వాటా వడ్డీలు, వాయిదాల చెల్లింపులకే సరిపోతోందని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల సుమారు 7 వేల కోట్ల రూపాయలను కేవలం అప్పుల వాయిదాల కోసమే కేటాయించాల్సి వస్తోందని టీపీసీసీ చీఫ్ గుర్తు చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో నిధుల విడుదల కొంత ఆలస్యం కావడం సహజమని ఆయన అభిప్రాయపడ్డారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి అత్యంత అనుభవం ఉన్న నాయకుడని, ఆయనకు రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై పూర్తి అవగాహన ఉంటుందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. అందుకే ఆయన పెద్ద మనసుతో ప్రస్తుత ఇబ్బందులను అర్థం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఎవరినీ నిర్లక్ష్యం చేయడం లేదని, కేవలం సాంకేతిక, ఆర్థిక కారణాల వల్లే ఈ జాప్యం జరుగుతోందని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందనే విషయాన్ని మహేష్ కుమార్ గౌడ్ నొక్కి చెప్పారు. నిధుల కొరత ఉన్నప్పటికీ ప్రాధాన్యత క్రమంలో పనులకు బిల్లులు చెల్లిస్తున్నామని వివరించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి కేవలం ఎమ్మెల్యే మాత్రమే కాకుండా ప్రభుత్వ సలహాదారుగా కీలక బాధ్యతల్లో ఉన్నారని, ప్రభుత్వంలోని అంతర్గత సమస్యలను ఆయన అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో కాంట్రాక్టర్ల సమస్యలు, నిధుల కొరతపై ఆయన ఆవేదనలో న్యాయం ఉన్నప్పటికీ, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సహకరించాలని విన్నవించారు. సిద్ధాపూర్ రిజర్వాయర్ పనుల విషయంలో పోచారం పడుతున్న ఆవేదనను ప్రభుత్వం గమనించిందని మహేష్ కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా కలవలేదన్న అంశంపై స్పందిస్తూ, పాలనాపరమైన బిజీ వల్ల లేదా సాంకేతిక కారణాల వల్ల అలా జరిగి ఉండవచ్చని సరిపెట్టారు. సీనియర్ నాయకుల గౌరవానికి భంగం కలగకుండా చూసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన అంగీకరించారు. త్వరలోనే ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించి, ఆగిపోయిన పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రస్తుత రాజకీయ ముఖచిత్రం గమనిస్తే, పాలక పక్షంలోనే సమన్వయ లోపం కనిపిస్తోందన్న విమర్శలకు మహేష్ కుమార్ గౌడ్ చెక్ పెట్టే ప్రయత్నం చేశారు. పార్టీ నాయకత్వం, ప్రభుత్వం మధ్య ఎటువంటి విభేదాలు లేవని, కేవలం నిధుల సర్దుబాటులో ఉన్న ఇబ్బందులే ఇలాంటి పరిస్థితులకు కారణమని ఆయన విశ్లేషించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి లాంటి క్లీన్ ఇమేజ్ ఉన్న నాయకులు అసంతృప్తితో ఉండటం పార్టీకి మంచిది కాదన్న ఉద్దేశంతోనే పీసీసీ చీఫ్ స్వయంగా రంగంలోకి దిగి సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది. పాత ప్రభుత్వ హయాంలో జరిగిన ఆర్థిక విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించడానికి సమయం పడుతుందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. అస్తవ్యస్తంగా మారిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే క్రమంలో కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తోందని, దీనివల్ల సంక్షేమ, అభివృద్ధి పథకాలకు నిధుల కేటాయింపులో జాప్యం జరుగుతోందని చెప్పారు. ఈ వాస్తవాలను పోచారం వంటి సీనియర్లు ప్రజలకు వివరించాలే తప్ప, బహిరంగంగా విమర్శలు చేయడం వల్ల ప్రతిపక్షాలకు ఆయుధం ఇచ్చినట్లు అవుతుందని ఆయన పరోక్షంగా సూచించారు. నిజామాబాద్ జిల్లా రాజకీయాల్లో పోచారం శ్రీనివాస్ రెడ్డికి ఉన్న పట్టు, ఆయన ఇమేజ్ దృష్ట్యా ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యంగా రైతు నాయకుడిగా పేరున్న ఆయన, సాగునీటి ప్రాజెక్టుల నిధుల కోసం నిరసన తెలపడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి పాత బిల్లులను క్లియర్ చేయాలని, అప్పుడే కాంట్రాక్టర్లు ముందుకు వస్తారని ఆయన చేసిన హెచ్చరికను అధికారులు కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో పనులు ఆగితే అది అంతిమంగా ప్రజల్లో వ్యతిరేకతకు దారితీస్తుందని ఆయన ఆవేదనలో ఆంతర్యం. చివరికి, మహేష్ కుమార్ గౌడ్ తన వివరణతో పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి అనుభవం ప్రభుత్వానికి ఎంతో అవసరమని, ఆయన సూచనలను గౌరవిస్తామని చెప్పారు. నిధుల విడుదల ప్రక్రియను వేగవంతం చేసేలా ఆర్థిక శాఖతో మాట్లాడతామని భరోసా ఇచ్చారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం మధ్య ఉన్న కమ్యూనికేషన్ గ్యాప్‌ను తొలగించి, ఉమ్మడి లక్ష్యం దిశగా పని చేయాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు. ఈ వివరణతోనైనా పోచారం శాంతిస్తారా లేదా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది. రాష్ట్ర ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడి ప్రాజెక్టులు ఎప్పుడు పూర్తవుతాయో వేచి చూడాలి.

## పది పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్

**పరీక్ష కేంద్రాలవద్ద మౌలిక వసతుల కల్పన పై ఆరా**



**భద్రాద్రి ప్రతినిధి, విశాలాభారతి:**

సోమవారం పాల్వంచ మండలంలోని బోల్లారి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించి, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సమగ్రంగా ఆరా తీశారు. తనిఖీలలో భాగంగా పరీక్ష హాళ్లలో విద్యార్థుల కూర్చునే విధానం, ప్రశాంత వాతావరణం, తగిన వెలుతురు, తాగునీటి సదుపాయం, విద్యుత్, ఫ్యాన్లు, శుభ్రత వంటి మౌలిక వసతులను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి సరైన దూరం పాటిస్తూ కూర్చునేలా చర్యలు తీసుకోవాలని, పరీక్ష సమయంలో ఎటువంటి అంతరాయాలు లేకుండా అన్ని ఏర్పాట్లు సమర్థంగా ఉండాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రంలో ప్రశ్నపత్రాల పంపిణీ, సమాధాన పత్రాల సేకరణ, భద్రపరిచే విధానం వంటి అంశాలను పరిశీలించి, పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాతత పాటించాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవకతవకలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని, మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్లు, సిబ్బంది తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని, విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ సహాయకరంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రత్యేకంగా విద్యార్థులు ఒత్తిడికి లోనవకుండా, ఆత్మవిశ్వాసంతో ప్రశాంతంగా పరీక్షలు రాసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ప్రధానోపాధ్యాయురాలు మంగమ్మ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కపై మాజీ ఎమ్మెల్యే నిప్పులు



**మోటకొండూర్, విశాల భారతి:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లీగల్ నోటీసులు పంపినందుకు రాష్ట్ర మంత్రి సీతక్కపై మాజీ అలర్ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఎదురుదాడి చేశారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రేయింబవళ్లు పనిచేసిన వ్యక్తి పట్ల మంత్రికి కనీస గౌరవం కూడా లేకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్న మంత్రి వైఖరిని ఆమె ప్రశ్నించారు. ఆరోపణలు చేసే ముందు మంత్రి నిజాలు వెల్లడించాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతున్నందున, ప్రజల దృష్టి మళ్లించడానికే కాంగ్రెస్ నాయకులు తనతో ఇలాంటి పనులు చేయిస్తున్నారని ఆమె ఆరోపించారు. మంత్రి గారు ఎప్పుడైనా గురుకుల పాఠశాలలను తనిఖీ చేశారా అని ఆమె అడిగింది. మంత్రి సీతక్క అడిగిన వెంటనే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ములుగును జిల్లాగా ఏర్పాటు చేశారని ఆమె గుర్తు చేశారు. తమ పార్టీ హయాంలోనే గ్రామాలు, టాండాల అభివృద్ధి జరిగిందని ఆమె అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వస్తున్న ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. గిరిజన కుమార్తెగా మంత్రి సీతక్క పట్ల తనకు గౌరవం ఉందని, అయితే ఆమె బాధ్యతారహితంగా ప్రవర్తించకూడదని ఆమె పేర్కొన్నారు. కేసీఆర్‌పై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని ఎవరూ నాశనం చేయలేరని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొట్ల యాదయ్య, నాయకులు ఎండి బురాన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్న రావిరాలలో వైద్య శిబిరం నిర్వహణ

**ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సేవలు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగాఅబ్దుల్లాపూర్ మెట్ మండలం,చిన్న రావిరాల గ్రామ పంచాయతీ ఆవరణలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ శ్రేయాస్ ఆధ్వర్యంలో వైద్య బృందం గ్రామ ప్రజలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు ఇచ్చింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బండారి అనిత, ఆకిటి రామకృష్ణారెడ్డి, నారెడ్డి రిషితా, సతీష్ రెడ్డి, రాపోలు మల్లేష్, బండారి సత్యనారాయణ, మహిళా సంఘం అధ్యక్షురాలు కొమరవెల్లి రేణుక, కళ్లెం శ్రీధర్ రెడ్డి, కళ్లెం లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను పొందారు.

## కరకగూడెంలో రోడ్డు భద్రత మాసోత్సవం

**ఎస్సై నాగేశ్వరరావు**



**విశాలభారతి న్యూస్:** కరకగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ఎస్సై నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం ప్రమాదకరమని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోలేబోయిన సుజాత, ఉప సర్పంచ్ బుడగం రాము,కార్యదర్శి రామకృష్ణ, సయ్యద్ ఇక్బాల్ హుస్సేన గ్రామస్తులు పాల్గొన్నారు.

## రేణుకా చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్



**భద్రాద్రి ప్రతినిధి, విశాలాభారతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విలీనం చేసిన ఐదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణ రాష్ట్రంలో కలపాలని డిమాండ్ చేస్తూ భద్రాచలంలో నిర్వహిస్తున్న సమరభేరి కార్యక్రమంలో పాల్గొనటానికి జిల్లాకు విచ్చేసిన రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరిని జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం పాల్వంచ నవభారత్ గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ పుష్పగుచ్ఛం అందజేసి ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై స్వల్పంగా చర్చించారు.

## పేదలకు సొంతింటి కల నెరవేర్చటమే ప్రభుత్వ లక్ష్యం



**మోత్కూరు, విశాల భారతి:** పేదలకు సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకొని గృహ ప్రవేశానికి వెళ్తున్న స్థానిక నిరుపేద కుటుంబానికి చెందిన జంగ భాగ్యమ్మ వెంకటనర్సు ఇంటికి సోమవారం ఎమ్మెల్యే సామేల్ హాజరై నూతన గృహప్రవేశానికి రిబ్బన్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో పేదలకు రాష్ట్రంలో ఒక్క ఇల్లు కూడా నిర్మించే లేదని, నేడు ప్రజా ప్రభుత్వంలో నియోజకవర్గ 3500 ఇండ్లు చొప్పున 4.50 వేల ఇండ్లను నిర్మిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకునే నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం విడుతల వారీగా 5 లక్షల రూపాయల చొప్పున చెల్లిస్తుందని తెలిపారు. పేదలకు గృహ వినియోగదాలకు 200 యూనిట్లు ఉచితంగా అందించడంతోపాటు దేశంలో ఎక్కలేని విధంగా ప్రతి రేషన్ కార్డు దారునికి సన్న బియ్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు అంజమ్మ వెంకట నర్సు, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య, వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్న, మున్సిపల్ కమీషనర్ కే సతీష్ కుమార్ మున్సిపల్ కోఆప్షన్ మాజీ సభ్యులు పోలినేని ఆనందమ్మ. కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## గొలనుకొండలో వైద్య శిబిరం ప్రారంభం


**ఆలేరు, విశాలభారతి:** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గ్రామ సర్పంచ్ ఇందూరి యాదిరెడ్డి తెలిపారు. సోమవారం ఆలేరు మండలంలోని గొలనుకొండ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షారాజీపేట వైద్యాధికారి హైమావతి, ఎంఎల్ హెచ్ పి డాక్టర్ మానస, ఏఎన్ఎం కవిత, ఉప సర్పంచ్ యాదగిరి, పంచాయతీ కార్యదర్శి సాగర్, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, గ్రామ యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# కురవి సంతా అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- "తెలంగాణ లీడర్" కథనాలతో కదిలిన పాలకులు..!
- అధిక వసూళ్లు.. రైతులపై అదనపు భారం
- నకిలీ రసీదులతో భారీ వసూళ్లు
- రిజిస్ట్రేషన్‌కు ముందే సంత అప్పగింతపై అనుమానాలు
- డీపీవో, డీఎల్‌పీవోలకు కూడా పిర్యాదులు
- ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్.
- అక్రమాలపై హైకోర్టుకు వెళ్తామంటున్న వార్డు సభ్యులు



**కురవి, విశాలభారతి:** ఇటీవల "విశాల భారతి " దినపత్రికలో వరుసగా ప్రచురితమవుతున్న కురవి గ్రామ పంచాయతీ తై బజారు, పశువుల సంతలో జరుగుతున్న అక్రమాల కథనాలకు స్పందిస్తూ గ్రామ పంచాయతీకి చెందిన కొంతమంది వార్డు సభ్యులు జిల్లా కలెక్టర్‌తో పాటు డీపీవో, డీఎల్‌పీవోలకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పత్రికలో వెలుగులోకి వచ్చిన అంశాలపై అధికారులు తక్షణమే దృష్టి సారించి సమగ్ర విచారణ జరిపించాలని వార్డు సభ్యులు కోరినట్లు తెలిసింది. తై బజారు, పశువుల సంతలో అధిక వసూళ్లు, నకిలీ రసీదుల వినియోగం, టెండర్ నిబంధనల ఉల్లంఘనలు వంటి అంశాలను ఫిర్యాదులో ప్రస్తావించినట్లు సమాచారం. పంచాయతీ నిబంధనల ప్రకారం నిర్ణయించిన రుసుములకు విరుద్ధంగా రైతులు, వ్యాపారుల నుండి అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పశువుకు నిర్ణీత రుసుము రూ.300 ఉండగా రూ.400, మేకలు లేదా గొర్రెలకు రూ.200 బదులు రూ.300 వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. దీంతో ప్రతి జంతువుపై అదనంగా రూ.100 భారం పడుతోందని పేర్కొన్నారు. అధికారిక రసీదులు ఇవ్వకుండా పాత బుక్కులు, నకిలీ రసీదులతో వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల భవిష్యత్తులో సంతా కు నష్టం జరుగుతుంది. అధిక వసూళ్ల వల్లా రైతులు, వ్యాపారులు సంతకు రావడానికి జంకుతున్నారని, దీంతో భవిష్యత్తులో గుత్తేదారులు ముందుకు రాకుంటే గ్రామ పంచాయతీ అదాయానికి గండి పడే అవకాశం ఉందని వార్డు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. టెండర్ ప్రక్రియ పూర్తయినా, రిజిస్ట్రేషన్ పూర్తి కాకముందే సంత నిర్వహణను గుత్తేదారుకు అప్పగించడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు.

**కురవి సంత రసీదుల్లో కొత్త వివాదం..,**

కురవి పశువుల సంతలో మరో వివాదం వెలుగులోకి వచ్చింది. సంతలో అమ్మబడిన పశువులు, గొర్రెలు దొంగిలించబడితే నిబంధనల ప్రకారం గుత్తేదారులదే బాధ్యతగా ఉండాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా కొనుగోలు చేసిన వారిదే బాధ్యత అంటూ రసీదుల్లో నమోదు చేస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ప్రతి సోమవారం జరుగు సంతాలో గ్రామ పంచాయతీ సిబ్బందితో మైక్ ద్వారా ప్రచారం చేయాలని, గోడలపై నిబంధనల పట్టిక బోర్డులు ఏర్పాటు చేయాలని పాలకమండలి తీర్మానం ఉన్నా అందుకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు చేశారు. ఈ అక్రమాలపై పలుమార్లు స్థానిక అధికారులకు తెలియజేసినా ఫలితం లేకపోవడంతో ఉన్నతాధికారులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేసి, గత వసూళ్ల రికార్డులు, టెండర్ పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు పరిశీలించాలని వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. స్థానికంగా ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారగా, అధికారుల స్పందన ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్



**మోటకొండూర్, విశాలభారతి :** మోటకొండూరు పట్టణంలో వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని స్థానిక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా ధాన్యం కొనుగోలు నిర్వహించడంతో పాటు, రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అలాగే కేంద్రంలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు.దళారులు రైతులను మోసం చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులు సంతోషంగా ఉండేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి జయమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగపురం మల్లేష్, నాయకులు కొంత మోహన్ రెడ్డి, భూమండ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## దళారులకు దాన్యం విక్రయించవద్దు




**ఆర్మూర్ ,విశాలభారతి:** రైతులు పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని ఉమ్మెడ గ్రామ సర్పంచ్ నక్క భోజెందర్ అన్నారు. నందిపేట మండలం ఉమ్మెడ గ్రామంలో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గిట్టుబాటు ధరలను అందిస్తుందని కొనుగోలు కేంద్రాలలో విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బర్రె ఆనంద్, ఆఫీసర్ పర్సనల్ ఇంచార్జ్ కె బాబురావు, డొంకేశ్వర్ సొసైటీ సీఈవో కృష్ణ కుమార్, ఉమ్మెడ మాజీ ఎంపీటీసీ దూద వెంకటేష్, చైర్మన్ ఓంకార్, గుడ్డోళ్ల సాయి రెడ్డి, ఉప్పరి భూమేశ్వర్, మల్లు మురళి, రాముడ నవీన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తప్పుదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**సికింద్రాబాద్ జోన్ డీసీపీకి దళిత చైతన్య సంఘం పిర్యాదు**



**సికింద్రాబాద్, విశాలభారతి :** చట్టాలను ఉల్లంఘిస్తూ ప్రభుత్వ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న బిల్డర్లపై(భవన నిర్మాణదారులపై)కట్టిన చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షితమూర్తికి దళిత చైతన్య సంఘం కోరింది.ఈ మేరకు దళిత చైతన్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ సోమవారం వారి బృందం మధుసూదన్,బాలకృష్ణలతో డీసీపీని కలిసి లిఖిత పూర్వకంగా పిర్యాదు చేశారు.సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ అని పెట్టుకుని జిహెచ్ఎంసి నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా భవన నిర్మాణాలు చేస్తున్నారని... ఈ నిర్మాణాలు అక్రమం అని సంబంధిత జిహెచ్ఎంసి అధికారులకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారిని బెదిరిస్తున్నారని డీసీపీకి వివరించారు.సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామ్ సుందర్ అనే వ్యక్తి ఆర్ట్స్ కాలేజ్ రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్‌కు ఆనుకుని భారీ భవంతిని నిర్మించాడు.జిహెచ్ఎంసి నుండి జీ ప్లస్ టూ అనుమతి తీసుకుని... జిహెచ్ఎంసి చట్టానికి వ్యతిరేకంగా భారీ సెల్లార్ తవ్వారు.అలాగే మూడు అంతస్తులు అక్రమంగా..అదనంగా నిర్మించాడు.ఈ అక్రమ భవనంపై స్థానికులు పలుమార్లు జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదు చేయగా జిహెచ్ఎంసి అధికారులు స్పందించి ఆ భవనానికి నోటీసులు ఇచ్చి మూడు సార్లు సీజ్ కూడా చేశారు. అయినా ఆ నిర్మాణదారుడు అదేమీ లెక్క చేయకుండా నిర్మాణాన్ని పూర్తిచేసి ఫంక్షన్ హాల్ నిర్మించాడు. ఈ భవనం అక్రమ నిర్మాణం అని తాను జిహెచ్ఎంసి కమిషనర్ కు, సికింద్రాబాద్ జోన్, జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు చేయగా సదరు నిర్మారుడు ఆ విషయం తెలుసుకుని ఇతరులతో తనకు ఫోన్ చేపించారు. నేను అతనికి లొంగక పోవడంతో చేసేదేమీ లేక తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయంలో, సికింద్రాబాద్ జోన్ డిసిపి కి కూడా పిర్యాదు చేశారని ముప్పిడి తెలిపారు.దళిత వర్గానికి చెందిన నేను కార్ లో తిరుగుతుంటే ఓర్వలేక , ఎదుగుదల ఇష్టం లేక తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. పూర్తిగా ఎంక్వయిరీ చేసి తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిసిపిని కోరారు. వెంటనే స్పందించిన డిసిపి జిహెచ్ఎంసి అధికారుల నుండి భవన నిర్మాణ అనుమతుల నకలు తీసుకుని తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై చట్టరిచ్చ కఠిన చర్యలు తీసుకుంటామని తమకు హామీ ఇచ్చారని నవీన్ కుమార్ మాదిగ తెలిపారు.

## అర్రైవ్ –అ లైవ్ గోడపత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్




**భద్రాద్రి ప్రతినిధి, విశాలాభారతి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 13 నుండి 18 వరకు నిర్వహించనున్న "అరైవ్ – అ లైవ్" కార్యక్రమాల గోడపత్రికను జిల్లా కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారి భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం అత్యవసరమని తెలిపారు. ప్రతి సంవత్సరం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో మానవ తప్పిదాలే ప్రధాన కారణమవుతున్నాయని పేర్కొంటూ, వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. "అరైవ్ – అ లైవ్" కార్యక్రమాల ద్వారా ప్రజల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లు పెంపొందించడం, ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించడం లక్ష్యమని వివరించారు. హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగం, అధిక వేగంతో వాహనాలు నడపకపోవడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకుండా ఉండడం వంటి భద్రతా చర్యలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు. యువత ముఖ్యంగా ట్రాఫిక్ నియమాలను గౌరవిస్తూ, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాల భాగంగా గ్రామసభలు,అవగాహన ర్యాలీలు, పాఠశాలలు మరియు కళాశాలల్లో ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు, డ్రైవర్లకు శిక్షణ శిబిరాలు, ప్రజలకు అవగాహన కల్పించే వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ ,సిబ్బంది మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీపీఐకి విరాళాలివ్వాలని పిలుపు



**ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో భాగంగా సామూహిక విరాళాల సేకరణ**

**విశాల భారతి,అబ్దుల్లాపూర్ మెట్టు :**

ప్రజా పోరాటాలతో వందేళ్లు పూర్తి చేసుకున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)ను ప్రజలు విరాళాలిచ్చి ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పిలుపునిచ్చారు. ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో భాగంగా అబ్దుల్లాపూర్మెట్ మండల, కుత్బుల్లాపూర్ శాఖ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సామూహిక విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆందోజు రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ.. దేశంలో పీడిత ప్రజల తరపున నిరంతరం పోరాటాలు చేస్తూ వందేళ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ సీపీఐ మాత్రమేనన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడే పార్టీలను ప్రజలే ఆదుకోవాలని, తమకు తోచిన విధంగా సహాయం చేసి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని కూడా పిలుపునిచ్చారు. అబ్దుల్లాపూర్మెట్ మండలంలోని అన్ని ప్రాంతాల్లో ఈ విరాళాల సేకరణ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కార్మికులు, కర్షకులు, పీడిత వర్గాల హక్కుల కోసం ఎర్రజెండా కింద నిరంతరం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అజ్మీర హరిసింగ్ నాయక్, శాఖ కార్యదర్శి పొన్నాల యాదగిరి, లావణ్య, ఇసాక్, శ్రీకాంత్, బిక్షం నాయక్, వినోద్ నాయక్, శ్రీను, రమేష్, రమాదేవి, శిల్ప, సంతోష్, శంకర్, మండల కౌన్సిల్ మరియు కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వీయ క్రమశిక్షణతో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు

**ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలి : ఎస్పీ రోహిత్ రాజు**



**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:**

స్వీయ క్రమశిక్షణతో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని,రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి,ప్రజలలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అర్రివ్అలీవ్ 2026 కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. ఇందులో భాగంగా సోమవారం పాల్వంచ పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో ఎంసిబిటి, ఐటిఐ కళాశాల విద్యార్థిని,విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కారిక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరు రోజుల పాటు రోడ్డు ప్రమాదాలను నియంత్రిండానికి ఏర్పాటు చేసిన కారిక్రమలో ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ. హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ ప్రాధాన్యత,డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి విద్యార్థులకు వివరించారు.రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే రోడ్డు ప్రమాదాలను నియంత్రిచ్చవచ్చని అన్నారు.రోడ్డుపై విధులలో ట్రాఫిక్ పోలీసులు ఉన్నా ,లేకపోయినా వాహనాలను నడిపేటప్పుడు నియమ, నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించే విధంగా సివిక్ సెన్స్ ను కలిగి ఉండాలని కోరారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను గౌరవించి తమ ప్రాణ భద్రతతో పాటు,ఇతరుల భద్రతకు కూడా సహకరించాలని,విజ్ఞప్తి చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్,ర్యాష్ డ్రైవింగ్,సెల్‌ఫోన్ డ్రైవింగ్,రాంగ్ రూట్,సిగ్నల్ జంపింగ్,ఓవర్ లోడ్ వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు. విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ తమ తల్లీదండ్రుల ఆశయాలకు తగ్గట్టుగా నడుచుకుంటూ మంచిగా చదువుకుని క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలని అకాక్షించారు.అనంతరం రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేశారు.ఈ కారిక్రమానికి సుమారు 300 మంది విద్యార్థిని,విద్యార్థులు హాజరయ్యారు.ఈ కారిక్రమంలో మున్సిపల్ కమీషనర్ సుజాత,ఆర్టీఓ వెంకటరమణ,స్థానిక కార్పొరేటర్ నూకల సరిత,మెడికల్ ఆఫీసర్ రామ్ ప్రసాద్,మొహమ్మద్ అలీ,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,పాల్వంచ సీఐ సతీష్,ఎస్సైలు నాగరాజు,జీవన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


## మాకుల జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**మరిపెడ, విశాలభారతి:** మాకుల జాతరకు భారీగా తరలివస్తున్న భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని మరిపెడ పోలీసులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఈ ఏర్పాట్లను సర్కిల్ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ వీరభద్రరావు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.జాతర ప్రాంతంలో భక్తుల రాకపోకలను సజావుగా నిర్వహించేందుకు ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్య రహదారుల వద్ద పోలీసు సిబ్బందిని మోహరించి వాహనాల రద్దీని నియంత్రిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం పార్కింగ్ ఏర్పాట్లు కూడా చేశారు. జాతర ప్రాంగణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ, భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా పోలీసులు కృషి చేస్తున్నారు. పోలీసుల కట్టుదిట్టమైన భద్రతా చర్యలతో భక్తుల్లో విశ్వాసం పెరుగుతోంది.



## ఇంటర్ ఫలితాల్లో బూర్గంపహాడ్ గురుకుల విద్యార్థినిల హవా


**సాధారణ విద్యార్థులు అసాధారణ ఫలితాలు ..శాలువాలతో సత్కరించిన సర్పంచ్,ఉపసర్పంచ్**



**బూర్గంపాడు, విశాలభారతి:** తెలంగాణ ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాలలో బూర్గంపహాడ్ మండల కేంద్రంలో గల తెలంగాణ రాష్ట్ర గురుకుల కళాశాల ( టి ఎస్ ఆర్ జె సి ) విద్యార్థినీలు రాష్ట్ర స్థాయి ర్యాంకులతో ప్రభంజనం సృష్టించారు. ద్వితీయ సంవత్సరంలో వందకి వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపిసి విభాగం నుండి ఎ.సంజన 1000 మార్కులకు గాను 992 సాధించగా, బైపిసి విభాగం నుండి పి.రమ్యా 1000కి గాను 992 మార్కులు సాధించారు. అదేవిధంగా ప్రథమ సంవత్సరం నుండి ఎంపిసి విభాగంలో సవీరా 470 గాను 467 మార్కులు సాధించగా బైపీసీ విభాగం నుండి డి. రమ్యశ్రీ 440 కి గాను 435 మార్కులతో సాధారణ విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్కులు సాధించారు. ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరంలో 80 మంది విద్యార్థినులకు గాను 75 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 94 శాతం సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 46 మంది విద్యార్థినిలు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా ప్రథమ సంవత్సరం ఎంపిసిలో 400 మార్కులకు పైగా 19 మంది విద్యార్థునిలు మార్కులు సాధించగా, బైపిసి లో 400 మార్కులకు పైగా 25 మంది విద్యార్థినిలు మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 900 కి పైగా 6గురు, బైపీసీలో 900 కి పైగా 14 మంది విద్యార్థినిలు మార్కులు సాధించి ఔరా అనిపించారు. ఈ సందర్భంగా విషయం తెలుసుకున్న బూర్గంపాడు సర్పంచ్ మంద నాగరాజు, ఉప సర్పంచ్ గుండె వెంకన్న స్థానిక ప్రిన్సిపల్ శ్రీమతి జి.హరిత తో కలిసి విద్యార్థినులను అభినందించి, వారికి శాలువాలతో సత్కారం చేసి, మిఠాయిలు తినిపించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ను శాలువాతో కళాశాల బృందం, సర్పంచ్,ఉపసర్పంచ్ సన్మానించారు. ఇంతటి ప్రతిభగల విద్యార్థుల తల్లిదండ్రులను సైతం సత్కరించారు. విద్యార్థునీలకు అన్ని రకాలుగా మా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఆ ప్రజా ప్రతినిధులు తెలిపారు, వారిని సైతం కళాశాల బృందం శాలువాలతో సత్కరించారు.

## ఆరోగ్యం పట్ల అవగాహనను పెంపొందించుకోవాలి

**బాలోత్సావ్ వ్యవస్థాపకులు డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు**



**పాల్వంచ విశాలభారతి:** ఉత్తమ పౌరులుగా రూపుదిద్దుకోవడానికి పాఠశాల తో పాటు కుటుంబ వాతావరణం కూడా చాలా అవసరము అని డాక్టర్ రమేష్ బాబు, ఈరోజు ఎంపీ హై స్కూల్, ఎర్రగుంట పాఠశాల యందు జరిగిన కుటుంబ విలువలు మరియు ఆరోగ్యము అను అంశంపై జరిగిన విద్యార్థులతో జరిగిన సమావేశము నందు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులు అందరూ చదువుతోపాటు సంస్కారము నేర్చుకోవాలని మన జీవితంలో మన ఎదుగుదలకు తోడ్పడిన కుటుంబ సభ్యులను,తల్లిదండ్రులను, బంధు మిత్రులను సదా గుర్తుంచుకోవాలని తెలిపినారు. అదే విధంగా విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఆరోగ్యం పై అవగాహనను పెంపొందించుకోవాలని మరియు విద్యతో పాటు అన్ని రంగాలలో తన నైపుణ్యాలను సర్వతోముఖాభివృద్ధిని పెంపొందించుకోవాలని చెప్పినారు. ఎంపీ హై స్కూల్ ఎర్రగుంట పాఠశాల వాతావరణం చాలా బాగా ఉన్నదని కార్పొరేట్ పాఠశాల కన్నా మిన్నగా సాంకేతిక బోధనా పరికరాలు అంకిత స్వభావం గల ఉపాధ్యాయులు ఉన్నారని ఉపాధ్యాయులని ప్రశంసించినారు. కొత్తగూడెంలో బాలోత్సవ్ నిర్వహించడం ద్వారా కొత్తగూడెం పేరుని దేశవ్యాప్తంగా ప్రచారం అయినదని అందుకు ప్రతిభ కారణమని వేలాదిమంది విద్యార్థుల ప్రతిభ ను వెలికితీయుటకు కొత్తగూడెం బాలోత్సవ్ ఒక వేదికగా తోడ్పడిందని పేర్కొన్నారు. ఎంపీ హై స్కూల్ ఎర్రగుంట విద్యార్థులని విద్యాలయంలో జరుగుతున్న విద్యార్థుల అభివృద్ధికి జరుగుతున్న కార్యక్రమాల్లో తెలుసుకొని ఈ పాఠశాల ఆదర్శ పాఠశాల ని తెలిపినారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి. వెంకటేశ్వరరావు గారు మాట్లాడుతూ విద్యతో పాటు మానవ విలువలు మరియు తల్లిదండ్రులు పెద్దలపట్ల గౌరవం సమాజాన్ని పట్ల బాధ్యతను పెంపొందించే అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని వాటిలో భాగంగానే ఈరోజు మా యొక్క కార్యక్రమానికి మిమ్మల్ని ముఖ్యఅతిథిగా ఆహ్వానించామని తెలిపినారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీష, డాక్టర్ శ్రీబాబు, పాఠశాల ఉపాధ్యాయులు లచ్చిరాం,శోభ, కామేష్, కవిత, వెంకన్నబాబు, నరేష్ మొదలగు ఉపాధ్యాయుల బృందము పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు

**విశాలభారతి, రామకృష్ణాపూర్:** పట్టణంలో నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారంతో ప్రశాంతంగా ముగిశాయి.మార్చి 14న ప్రారంభమైన పరీక్షలు ఏప్రిల్ 13తో పూర్తయ్యాయి. చివరి పరీక్ష ముగియడంతో విద్యార్థులు కేరింతలు కొట్టారు. పట్టణంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం కలిపి 268 మంది విద్యార్థులకు కాగా 100 % హాజరై పరీక్షలు రాశారని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల వద్ద పట్టణ ఎస్సై జాడి శ్రీధర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తూ 144 సెక్షన్ విదించారు. విద్యాశాఖ పర్యవేక్షణలో పరీక్షలు సజావుగా సాగాయి. విద్యార్థులు క్రమశిక్షణతో పరీక్షలు రాసి విద్యా సంవత్సరాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో స్నేహితులతో కలిసి సంబరాలు చేసుకుంటూ కేంద్రాల నుంచి బయటకు రావడం కనిపించింది.

# అంబేద్కర్ ఆశయ సాధనలో

# సీఎం రేవంతన్న!

**వెలివాడల వెక్కిరింతల నుంచి వెలిగిన దళిత ముత్యం మన డాక్టర్ బీఆర్ అంబేద్కర్. బాబాసాహెబ్ కొందరివాడు కాదు.. భారత రాజ్యాంగాన్ని రచించి ప్రజలకు కావాల్సిన అవసరాలను, హక్కులను తెలిపిన గొప్ప మహా నాయకుడు అందరివాడు. ఏప్రిల్ 14 ఆయన జయంతి. ఈ సందర్భంగా ఆ మహనీయుడిని మనమంతా స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.**



**విశాలభారతి**

ఎన్నో అవమానాలు ఎదుర్కొని, సమాజంలో వర్ణ, వర్గభేదాలు ఉండొద్దని మన భారత రాజ్యాంగాన్ని ప్రత్యేకంగా రూపొందించిన అంబేద్కర్, ప్రపంచవ్యాప్తంగా ఎందరికో ఆరాధ్యుడయ్యారు. అంటరానితనంపై, కుల దురహంకారంపై గొంతెత్తిన స్వరం... బాబాసాహెబ్ అంబేద్కర్. 1891లో ఏప్రిల్ 14న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని అంబవాడేలో తల్లిదండ్రులు... రాంజీ మలోజీ సాక్పాల్, భీమాబాయ్‌లకు జన్మించారు. పూర్తి పేరు భీమ్ రావ్ రాంజీ అంబేద్కర్. ఆనాడు ఆ బాల అంబేద్కర్ చదువుకోవాలన్నా... మంచినీళ్ళు తాగాలన్నాకులమే అడ్డుగా నిలబడింది. అందుకు ఆయన ఎన్నో ఇబ్బందులు, ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఆ అవమానాల నుంచే అత్యున్నత స్థాయికి ఎదిగి సమాజంలో వర్ణ, వర్గ భేదాలు ఉండొద్దని రాజ్యాంగాన్ని ప్రత్యేకంగా రూపొందించారు. దళిత, గిరిజన ప్రజలకు రిజర్వేషన్లు, హక్కులు కల్పించిన గొప్ప నాయకుడు అంబేద్కర్. నాడే ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎవరెవరికీ ఎంత రిజర్వేషన్ల ప్రకారం వేతనాలు తీసుకోవాలో, సమాజంలో ఎలా నడుచుకోవాలో, రాజ్యాంగంలో క్లుప్తంగా రచించి ప్రజలకు అందించిన గొప్ప మహత్తర నాయకుడాయన. బ్రిటీష్‌వాళ్ళ నుంచి మనకి స్వాతంత్ర్యవచ్చిన తర్వాత .... తొలి న్యాయశాఖ మంత్రిగా పని చేశారు. దాంతోపాటు, దేశానికి రాజ్యాంగ రచన బాధ్యతలను ఆయనకు మన తొలి ప్రధాని నెహ్రూ అప్పగించారు. ప్రభుత్వం భారత రాజ్యాంగ పరిషత్ నియమించిన రాజ్యాంగ సంఘానికి అంబేద్కర్ అధ్యక్షునిగా నియమించింది కూడా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం. అనేక దేశాల రాజ్యాంగాన్ని అధ్యయనం చేసి దృఢమైన... మంచి రాజ్యాంగాన్ని తయారు చేయడంలో ఆయన విజయం సాధించారు. తరతరాలుగా బడుగు, బలహీనవర్గాలను దగ్గర నుంచి చూసిన వ్యక్తిగా వారి అభ్యున్నతికి రిజర్వేషన్లు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన నిజమైన నాయకుడు అంబేద్కర్. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో ... మన రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి పరిపాలన కొనసాగుతుంది. దళిత, గిరిజన, బీసీ బిడ్డలకు సంబంధించిన సంక్షేమ హాస్టల్‌లో గతంలో ఎప్పుడూ లేని విధంగా 40 శాతం కాస్మొటిక్ ఛార్జీలు పెంచి ఆయా వర్గాలకు ఉపయోగపడే విధంగా నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి ఒక సెమి రెసిడెన్షియల్ పాఠశాలలు కడుతున్నారు. దీని ద్వారా ఆయా ప్రాంతాల్లోని పేద దళిత, గిరిజన, బీసీ వర్గాల పిల్లలకు పెద్ద ఎత్తున న్యాయం జరుగుతుంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని చేవేళ్ళ ఎస్సీ డిక్లరేషన్ ను కాంగ్రెస్ పార్టీ ఆలిండియా ప్రెసిడెంట్, మన దళిత అగ్రనేత మల్లీఖార్జున ఖర్గే దళితుల ఎస్సీల అభ్యున్నతికి ఎన్నో పథకాలు ప్రకటించిన విషయం తెలిసిందే. వాటి ఆచరణ దిశగా నేడు మన ప్రజా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుంది. గతంలో రెసిడెన్షియల్ స్కూల్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకువిడివిడిగా ఉండేవని, ప్రస్తుతం దళితులు, గిరిజనులు, బీసీ మైనార్టీలందరికీ ఒకేచోట ప్రతి నియోజకవర్గంలో ఒకే క్యాంపస్‌లో గురుకులాలన్నీ ఉండేలా ఏర్పాటు చేసి, కులాల మధ్య అంతరాలు చెరిపేయాలని ప్రజా ప్రభుత్వం భావించింది. పాత ప్రభుత్వంలో దళిత నాయకులకు అవమానం నిత్య కృత్యమైతే... మన ప్రజా ప్రభుత్వంలో ఒక దళిత బిడ్డ గడ్డం ప్రసాద్ కుమార్ ని స్పీకర్ చేసుకున్న పరిస్థితి ఉన్నది. మరొక దళిత బిడ్డ భట్టి విక్రమార్క గారిని డిప్యూటీ సీఎం చేసుకున్నాము. ఇంకొక దళిత బిడ్డను వైద్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహను చేసుకున్నాము. సంక్షేమ హాస్టళ్ళలోనే చదువుకొని వచ్చిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను కూడా మంత్రిని చేసి నేడు ఆ జాతుల సేవకు పునరంకితం అవుతున్నాము. ఈ మధ్యనే దళితులకు న్యాయం జరిగే విధంగా వర్గీకరణ సైతం చేసుకున్నం. ఇదొక సామాజిక విప్లవంగా చెప్పవచ్చు. ఇక నిన్న మొన్న రాజకీయాల్లోకి వచ్చిన కొందరు కాంగ్రెస్ దళిత జాతికి ఏం చేసిందని ప్రశ్నిస్తున్నారని, వారికి మా దగ్గర స్పష్టమైన సమాధానాలున్నాయి. అంబేద్కర్ స్ఫూర్తితో కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో దళితుల అభ్యున్నతి కోసం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తీసుకొస్తే... గత సర్కారు ఏమి చేయకుండా, గత సర్కారు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు చేయకుండా మోసగించింది. ప్రజలకు రిజర్వేషన్లు, హక్కులు కల్పించిన గొప్ప నాయకుడు అంబేద్కర్. బాబా అంబేద్కర్.... నవ భారత భాస్కరా అని మనమంతా ఆయన స్మరణతో... ప్రేరణ పొంది రానున్న సమాజానికి ఆయన భావాలు, భావోద్వేగపు భావజాలాన్ని ముందుకు తీసుకు వెళ్ళాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పలుగుచెరువు మహేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, రాజేంద్రనగర్ నియోజకవర్గం

## ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**విశాలభారతి,రామకృష్ణాపూర్ మంచిర్యాల :**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి .చంద్రయ్య, ఇంచార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు లతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. కన్నేపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన దుర్గం సంతోష్ తమ కుటుంబానికి తాతల నుండి వస్తున్న భూమిని కొందరు అక్రమంగా పట్టా చేసుకున్నారని, ఈ విషయమై విచారించి అట్టి పట్టాను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం పోతపల్లి (అంకతపల్లి) గ్రామానికి చెందిన ఆపు నూరి రాయలింగు తనకు గ్రామ శివారులో గల భూమి రికార్డులలో పొరపాటు నమోదయిందని, సవరించి పట్టా మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాజీపేట మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన మెంద్రపు లక్ష్మి తన భర్తకు చెందిన భూమిని ఆయన మరణించిన తర్వాత తన భర్త తమ్ముడు అక్రమంగా పట్టా చేసుకొని ప్రభుత్వ లబ్ధి పొందుతున్నారని, ఈ విషయమై విచారించి తనకు రావలసిన వాటాను ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మాజీ కో ఆప్షన్ సభ్యుడు అన్వర్ ఖాన్ తన దరఖాస్తులో బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని డంపింగ్ యార్డ్ స్థలం కబ్జా విషయంలో హైకోర్టు డిస్పోస్ ఆర్డర్ అమలు పరచాలని కోరారు. చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన అయిత రామ్ రెడ్డి పత్తి సాగు చేసుకుంటున్న తనకు చెందిన భూమి నూతన రికార్డు పుస్తకంలో నమోదు కాలేదని, నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. చెన్నూర్ మండల కేంద్రానికి చెందిన పిల్లల మల్లి సంధ్య తాను వికలాంగురాలు,



వితంతువును అని తనకు ఇల్లు నిర్మించుకునేందుకు స్థలాన్ని కేటాయించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండలం అందుగులపేట గ్రామానికి చెందిన చాట్ల సుగుణ తనకు వంశపారంపర్యంగా వస్తున్న భూమిలో సంవత్సరం క్రితం ఇల్లు నిర్మించుకున్నానని, ఈ ఇంటికి నెంబర్, ఎన్.ఓ.సి. ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం ఊరు మందమర్రి గ్రామానికి చెందిన పల్లె మల్లేష్ ఉట్నూర్ ట్రైబల్ కోర్టులో కేసు కొనసాగుతున్న భూమికి సంబంధించి జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 60 దరఖాస్తులు అందాయని, అందిన ప్రతి దరఖాస్తుల క్షేత్రస్థాయిలో పరిశీలించి సమన్వయంతో పరిష్కరించే దిశగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓడ్యాట్‌పల్లిలో నిరుపేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్

**విశాలభారతి,నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం ఓడ్యాట్‌పల్లి గ్రామంలో నిరుపేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. గ్రామంలో ఇప్పటికే 2000 సంవత్సరంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రభుత్వ భూమిలో నిరుపేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించినప్పటికీ, వాటిని ఇప్పటివరకు అందించకపోవడం తీవ్ర నిర్లక్ష్యంగా పేర్కొన్నారు. సుమారు 19 మంది ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన నిరుపేదలకు స్థలాలు కేటాయించినట్లు తీర్మానం చేసినప్పటికీ, ఆచరణలో అమలు కాలేదని తెలిపారు. అప్పట్లో బాధితులు కేటాయించిన స్థలాల్లో గుడిసెలు నిర్మించుకునే ప్రయత్నం చేయగా, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారని వివరించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చినా, ఆ హామీ నేటికీ నెరవేరలేదని విమర్శించారు.

తదుపరి 2020లో సర్వే నంబర్ 40లో గ్రామ పంచాయతీ మరోసారి తీర్మానం చేసి భూమిలేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయించినప్పటికీ, ఇప్పటికీ అమలు కాలేదని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం భూమిలేని వారికి స్థలాలు కేటాయించి గృహ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరగా, సమస్యపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో 19 మంది బాధితులు పాల్గొన్నారు.

# జ్ఞాన శిఖరం: డా. బి.ఆర్. అంబేద్కర్

**నిజామాబాద్, విశాలభారతి:**

బాబాసాహెబ్" అని ఆయన ప్రపంచ ప్రసిద్ధి పొందారు.ధర్మశాస్త్రపండితుడు, భారత రాజ్యాంగ నిర్మాత, రాజకీయ నాయకుడు , స్వతంత్ర భారత తొలి న్యాయ శాఖా మంత్రి , స్వాతంత్ర్యోద్యమ దళిత నాయకుడు, వృత్తి రీత్యా న్యాయవాది, ధర్మ రీత్యా బౌద్ధుడు,తత్వ శాస్త్రవేత్త , గొప్ప ఆంత్రోపోలజిస్ట్, చరిత్రకారుడు, అందర్నీ ఆకట్టుకొనే ప్రసంగికుడు,రచయిత, అర్థశాస్త్రవేత్త, పండితుడు, సంపాదకుడు, విప్లవకారుడు , బౌద్ధ ధర్మ పునరుద్ధరణకర్త. బాల్యంలోనే అడుగడుగునా బాధలకు, అవమానాలకు గురియై, కటిక బీదరికాన్ని ఎదుర్కొంటూ స్వయంకృషితో, స్వీయప్రతిభతో స్వతంత్ర భారతదేశంలో కేంద్రమంత్రి పదవిని అలంకరించిన మహామనీషి శ్రీ బాబాసాహెబ్ అంబేద్కర్. భీంరావ్ రాంజీ అంబేద్కర్ 1891 సంవత్సరం ఏప్రిల్ 14నాడు అప్పటి సెంట్రల్ ప్రావిన్సెస్ లో సైనిక స్థావరమైన మహోం అనే ఊరిలో (ఇప్పటి మధ్యప్రదేశ్ లో) రాంజీ మలోజీ సాక్పాల్ మరియు భీమాబాయ్ దంపతుల 14వ మరియు చివరి సంతానంగా జన్మించాడు. ఆయన కుటుంబం ఆధునిక మహారాష్ట్ర లోని రత్నగిరి జిల్లాలో అంబావడే పట్టణం (మందనగడ్ తాలూకాలో) వారు మరాఠీ నేపథ్యం కలవారు. వీరు మహర్ కులానికి చెందినవారు. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ యొక్క సైన్యంలో అంబేద్కర్ పూర్వీకులు పనిచేశారు. వీరి తండ్రి భారత సేవలు మోహో సైనిక స్థావరంలో బ్రిటీష్ సైన్యంలో పనిచేశాడు. భీమ్‌రావ్ ను తండ్రి చాలా క్రమశిక్షణతో పెంచాడు. బాల భీమ్‌రావ్ ప్రతిదినం రామాయణ, భారత, తుకారం, మోరోపంత్ ల భజన గీతాలు శ్రావ్యంగా చిన్ననాటి గానం చేసేవారు. ఆ కుటుంబం శాకాహారం మాత్రమే తీసుకొనేది.



**బాల్యములో అంబేద్కర్ ఎదుర్కొన్న అంటరానితన సమస్య**

ఆనాడు మెహర్లను అస్పృశ్యులుగా పరిగణించిన కాలమది. వేసవి సెలవుల్లో మామగారున్న గోరెగావ్ కు భీమ్‌రావ్, అన్న, మేనల్లుళ్ళతో పాటు వెళ్ళాడు. ముందుగా అనుకున్నట్లు, మామ స్టేషన్‌కు రాలేకపోయారు. స్టేషన్ నుండి, గ్రామానికి వెళ్ళటానికి బండిని కుదుర్చుకున్నాడు. కొంత దూరం వెళ్లిన తర్వాత బండివాడికి, వీళ్ళు మెహర్ కులస్థులని తెలిసింది. అందరినీ దరి మధ్యలోనే బండి నుండి దిగమన్నాడు. ఎండాకాలం. పిల్లలు ఆ బండివాణ్ణి ఎంతో బతిమాలు కొన్నారు. రెండింతలు బాడుగ ఇస్తామన్నారు. భీమ్‌రావ్ అన్న బండి తోలేటట్లు, బండివాడు నడచి వచ్చేటట్లు మాట్లాడుకున్నారు. ఆకలి దప్పులతో అలమటిస్తూ అర్ధరాత్రికి గోరేగావ్ చేరారు పిల్లలు. వీధికుళాయి నీరు తాగుతూ వున్న భీమ్‌రావ్ ను కొట్టి మంచినీరు త్రాగకుండా గెంటివేశారు. కులంపేర భీమ్‌రావ్ ను అవమానాలకు గురిచేశారు. రామ్‌జీ, సతారా వదలి పిల్లల చదువుకోసం బొంబాయి చేరాడు. భీమ్‌రావ్ ఎల్ఫిన్‌స్టన్ హైస్కూల్ లో చేరి మెట్రిక్యులేషన్ పాసయ్యాడు. సంస్కృతం చదువుకోవాలని ఆశించాడు. కులం అడ్డు వచ్చింది. ఇష్టంలేకున్నా పర్షియన్ భాష చదివాడు. 16వ ఏటనే పెద్దలు అతనికి పెళ్ళి చేశారు.

మహారాజాగారి మిలిటరీ కార్యదర్శి అయ్యాడు. కాని ఆఫీసులో నౌకర్లు కాగితాలు ఆయన బల్లపై ఎత్తి వేసేవారు! కొల్హాపూర్ మహారాజు సాహూ మహరాజ్ అస్పృశ్యతా నివారణకెంతో కృషి చేస్తుండేవాడు. మహారాజా సహాయంతో అంబేద్కర్ 'మూక నాయక్' అనే పక్షపత్రిక సంపాదకత్వం వహించాడు. 32 సంవత్సరాల వయసులో డా.అంబేద్కర్, బార్‌అట్‌లా, కొలంబియా విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి. లండన్ విశ్వవిద్యాలయం నుండి డి.ఎస్.సి పట్టాలను పొందాడు. కాని ఆఫీసు జవానులు కూడా ఈయనను అస్పృశ్యుడుగా చూచారు.

**దళిత మహాసభ (1927)- మనుస్మృతి దహనము**

1927లో మహాడ్‌లో దళిత జాతుల మహాసభ జరిగింది. మహారాష్ట్ర గుజరాత్‌ల నుండి కొన్ని వేలమంది వచ్చారు. మహాడ్ చెరువులోని నీటిని త్రాగుటకు వీలు లేకుండినది: అంటరానివారికి ఆ చెరువులో ప్రవేశం లేకుండినది. అంబేద్కర్ నాయకత్వంలో వేలాదిమంది చెరువు నీరు స్వీకరించారు. ఈ సంఘటన మహారాష్ట్రంలో సంచలనం కలిగించింది. 1927లో అంబేద్కర్ 'బహిష్కృత భారతి' అనే మరాఠి పక్ష పత్రిక ప్రారంభించాడు. ఆ పత్రికలో ఒక వ్యాసం వ్రాస్తూ అంబేద్కర్ ఇలా అన్నాడు: తిలక్ గనుక అంటరానివాడుగ పుట్టివుంటే 'స్వరాజ్యం నా జన్మ హక్కు'అని ఉండడు. ' అస్పృశ్యతా నివారణే నా ధ్యేయం, నా జన్మ హక్కు' అని ప్రకటించి ఉండేవాడని వ్రాశాడు. అంటే ఆనాడు అంబేద్కర్ కులతత్వవాదుల బాధను ఎంతగా అనుభవించాడో తెలుస్తుంది.

1927లో ఛత్రపతి శివాజీ త్రిశతి జయంతి ఉత్సవాలు మహారాష్ట్ర అంతటా గొప్పగా జరిగాయి. అంబేద్కర్ ను సాదరంగా ఆహ్వానించాడు కొలాబా లోని ఉత్సవ సంఘాధ్యక్షుడైన బ్రాహ్మణుడైన పలాయ శాస్త్రి. ఆ ఉత్సవాలలో ప్రసంగిస్తూ అంబేద్కర్ పీష్వాల సామ్రాజ్య పతనానికి ముఖ్యకారణం అస్పృశ్యతను పాటించడమే అన్నాడు. 1927 డిసెంబర్ 25న అంబేద్కర్ 'మనుస్మృతి'ని బహిరంగంగా కాల్చటం మరో సంచలనం కల్గించింది. ఆ విషయంగా మాట్లాడుతూ సవర్ణ హిందువుల దృష్టిని బలవంతాన ఆకర్షించడానికి అపుడపుడు అలాంటి తీవ్ర చర్యలు అవసరమవుతాయన్నాడు. అంతేకాదు, మనుస్మృతి లోని అన్ని భాగాలు నిందనీయాలు కావు అన్నాడు.

**అంటరానితనానికి అంబేద్కర్ చూపిన పరిష్కారం**

భారత జాతీయ కాంగ్రెస్ నడిపే జాతీయోద్యములోఅంటరానితన నిర్మూలన కోసం గాంధీ కృషి చేస్తూ ఉంటే ఆ కృషికి కాంగ్రెస్ సభ్యులనుండి పూర్తీ స్థాయిలో మద్దతు లభించలేదనే చెప్పాలి. గాంధి వర్ణ వ్యవస్థను భారత సమాజము యొక్క ప్రత్యేక లక్షణమని, ఎవరి కుల వృత్తిని వారు అనుసరించడం వల్ల ఎటువంటి పోటీలేని ఆర్ధిక వ్యవస్థ భారతసమజములో ఉన్నదని ఆయన సమర్ధించాడు. అయితే అంటరానివారుగా చూడబడుతున్న కులాల వారు తమ ఆత్మగౌరవమును త్యాగము చేస్తూ సమాజ బాగు కోసం తాము చేసే వృత్తులను చేస్తున్నారని అటువంటి వారిని ఇతర వర్ణముల వారందరూ గౌరవించాలని పేర్కొనెను. ఇలా కుల, అంటరానితన సమస్యకు గాంధీ సామాజిక, సాంస్కృతిక పరిష్కారమును చూపగా అంబేద్కర్ ఈ విషయములో గాంధీతో విభేదించాడు. అంటరాని కులాలు ఆర్ధికముగా బలపడనిదే, రాజకీయాధికారము పొందనిదే వారి సమస్యకు సమగ్రమైన పరిష్కారము దొరకదని అంబేద్కర్ భావించాడు.

**దళితులకు ప్రత్యేక నియోజక వర్గాలపై గాంధీ vs అంబేద్కర్- పూనా ఒప్పందం:**

1919 మాంటేగ్ చేమ్స్ ఫర్డ్ సంస్కరణలు భారతదేశములో ఎలా పనిచేస్తున్నాయో అధ్యయనం చేయడానికి, నూతన రాజ్యంగ సంస్కరణల కోసం సూచించేందుకు ఏర్పాటు చేయబడ్డ సైమన్ కమీషన్ భారతదేశాన్ని 1928 లో పర్యటించింది. ఆ పర్యటన అనంతరం ఆ కమిటీ బ్రిటిష్ ప్రభుత్వానికి అందించిన నివేదికను చర్చించడానికి బ్రిటిష్ ప్రభుత్వము మూడు రౌండ్ టేబుల్ సమావేశాలను ఏర్పరచింది. ఈ సమావేశాలు 1930, 1931, మరియు 1932 లలో జరిగాయి. ఈ మూడు సమావేశాలకు అంబేద్కర్ హాజరు అవ్వగా రెండవ సమావేశములో భారత జాతీయ కాంగ్రెస్ తరపున గాంధీ హాజరు అయ్యారు. ఈ సమావేశాములోనే గాంధీకు అంబేద్కర్ కు మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. అంబేద్కర్ దళితులకు ప్రత్యేక నియోజక వర్గాలు ఇవ్వాలని పట్టుబట్టగా, అలా ఇస్తే హిందూ సమాజం విచ్చిన్నమవుతుందని అందుకు గాంధీ ఒప్పుకోలేదు. ఏకాభిప్రాయము కుదరక పోవడముతో రెండవ రౌండ్ టేబుల్ సమావేశము నుండి గాంధీ బయటకు వచ్చేసెను. 1932 లో రామ్సే మెక్ డోనాల్డ్ "కమ్యూనల్ అవార్డు"ను ప్రకటించడం జరిగింది. దీని ప్రకారం దళితులకు ప్రత్యేక నియోజక వర్గాలు ప్రతిపాదించబడ్డాయి.

ఈ ప్రకటన వెలువడే నాటికి గాంధి శాసనోల్లంఘన ఉద్యమములో భాగముగా అరెస్ట్ అయి ఎరవాడ జైలులో ఉన్నారు. ఈ ప్రకటన గూర్చి తెలుసుకొని గాంధీ నిరాహారదీక్ష చేపట్టారు. అంబేద్కర్ పై నైతిక వత్తిడి పెరిగింది. చివరికి గాంధీ కి అంబేద్కర్ కు మధ్య పూనా ఒప్పందం కుదిరి కమ్యూనల్ అవార్డ్ కన్నా ఎక్కువp స్థానాలు ఉమ్మడి నియోజక వర్గాలలో ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. దీని తర్వాత గాంధి 'హరిజన్ సేవక్ సమాజ్' ఏర్పరచి అస్పృశ్యత నివారణకు కృషి చేసాడు. అంబేద్కర్ ను కూడా ఇందులో భాగస్వామిని చేసాడు గాంధీ. కాని అంటరాని తన నిర్మూలనలో గాంధి కున్న చిత్తశుద్ది మిగిలిన కాంగ్రెస్ నాయకులకు లేదు. దీనితో అంబేద్కర్ గాంధి ఉద్యమము నుండి బయటకు వచ్చి ప్రత్యేఖముగా దళిత సమస్య పరిష్కారానికి ఆలిండియా డిప్రేస్డ్ క్లాస్ కాంగ్రెస్, ఆలిండియా షెడ్యూల్ కాస్ట్ ఫెడరేషన్ వంటి అనేక రాజకీయ పార్టీలను ఏర్పాటు చేసి దేశవ్యాప్తముగా దళితులను సమీకరించే ప్రయత్నమూ చేసారు. ఈ సందర్భములో క్విట్ ఇండియా ఉద్యమం, ఆ తరువాత దేశ విభజనతో కూడిన స్వాతంత్రము రావడం జరిగాయి.

**రాజ్యంగ పరిషత్తు సభ్యుడిగా- మంత్రివర్గ సభ్యుడిగా అంబేద్కర్**

రాజ్యాంగ పరిషత్తు సభ్యుడుగ అంబేద్కర్ విశేష శ్రమవహించి రాజ్యాంగం రచించటం ఆయన శేష జీవితంలో ప్రముఖమైన ఘట్టం. టి.టి కృష్ణమాచారి (కేంద్రమంత్రి) ఒకమారు రాజ్యాంగ పరిషత్తులో మాట్లాడుతూ 'రాజ్యాంగ రచనా సంఘంలో నియమింపబడిన ఏడుగురిలో ఒకరు రాజీనామా చేశారు. మరొకరు మరణించారు. వేరొకరు అమెరికాలో వుండి పోయారు. ఇంకొకరు రాష్ట్ర రాజకీయాలలో నిమగ్నులయ్యారు. ఉన్న ఒక్కరిద్దరు ఢిల్లీకి దూరంగా ఉన్నారు. అందువల్ల భారత రాజ్యాంగ రచనా భారమంతా డా.అంబేద్కర్ మోయవలసి వచ్చింది. రాజ్యాంగ రచన అత్యంత ప్రామాణికంగా వుంటుందనటంలో ఏలాంటి సందేహం లేదు, అన్నాడు. కేంద్ర మంత్రి మండలిలో న్యాయశాఖ మంత్రిగా వుండి 1951 అక్టోబర్ లో మంత్రి పదవికి రాజీనామా చేశాడు

**విద్యాభ్యాసం ఉద్యోగంకుల వివక్ష**

**బరోడా మహారాజు శాయాజీరావ్ గైక్వాడ్ ఇచ్చిన 25 రూపాయల విద్యార్థి వేతనంతో 1912లో బి.ఏ. పరీక్షల్లో నెగ్గాడు. పట్టభద్రుడైన వెంటనే బరోడా సంస్థానంలో ఉద్యోగం లభించింది. కాని పై చదువులు చదవాలన్న పట్టుదలవల్ల ఉద్యోగంలో చేరలేదు. మహారాజుకు తన కోరికను తెలిపాడు. విదేశంలో చదువుపూర్తిచేసిన తరువాత బరోడా సంస్థానంలో పదేళ్లు పనిచేసే షరతుపై 1913లో రాజాగారి ఆర్థిక సహాయం అందుకొని కొలంబియా విశ్వవిద్యాలయం చేరాడు. 1915లో ఎం.ఏ. 1916లో పి.హెచ్.డి. డిగ్రీలను సంపాదించాడు. ఆనాటి సిద్ధాంత వ్యాసమే పదేళ్ల తర్వాత "ది ఎవల్యూషన్ ఆఫ్ ప్రావిన్షియల్ ఫైనాన్స్ ఇన్ ఇండియా" అను పేరుతో ప్రచురించబడింది. 1917 లో డాక్టర్ అంబేద్కర్‌గా స్వదేశం వచ్చాడు. అప్పటికి ఆయన వయస్సు 27 ఏళ్లు. అస్పృశ్యుడొకడు అంతగొప్ప పేరు సంపాదించుకోవటం ఆనాటి అగ్రవర్ణాలవారికి ఆశ్చర్యం కల్గించింది**

## బౌద్ధమును స్వీకరించుట

అంబేద్కర్ తన 56 ఏట సారస్వత బ్రాహ్మణ కుటుంబానికి చెందిన కుమారి శారదా కబీర్ ను పెళ్ళి చేసుకున్నాడు. మొదటి భార్య 1935లో మరణించింది.. 1956 అక్టోబర్ 14న నాగ్ పూర్ లో అంబేద్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించాడు. గాంధీజీతో అనేక విషయాలలో భేదించినా తాను మతం మారదలచుకున్నప్పుడు మాత్రం దేశానికి చాలా తక్కువ ప్రమాదకరం అయినదానినే ఎన్నుకుంటానని, బౌద్ధం భారతీయ సంస్కృతిలో భాగమని, ఈ దేశ చరిత్ర సంస్కృతులు, తన మార్పిడివల్ల దెబ్బతినకుండా చూచానన్నాడు. హిందువుగా పుట్టిన అంబేద్కర్ హిందువుగా మరణించలేదు. నిరంతర కృషితో సాగిన ఆయన జీవితం ఉద్యమాలకు ఊపిరిపోసింది. ముఖ్యంగా సాంఘిక సంస్కరణలకు. అంబేద్కర్ పెక్కు గ్రంథాలు వ్రాశాడు. 'ది ప్రాబ్లం ఆఫ్ ది రూపీ', 'ప్రొవిన్షియల్ డీ సెంట్రలైజేషన్ ఆఫ్ ఇంపీరియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటీష్ ఇండియా', 'ది బుద్ధా అండ్ కార్ల్ మార్క్స్', 'ది బుద్ధా అండ్ హిజ్ ధర్మ' ప్రధానమైనవి. ప్రసిద్ధ రచయిత బెవెర్లి నికొల్స్ డాక్టర్ అంబేద్కర్ భారతదేశపు ఆరుగురు మేధావులలో ఒకరు అని ప్రశంసించాడు. మహామేధావిగా, సంఘసంస్కర్తగా, న్యాయశాస్త్రవేత్తగా, కీర్తిగాంచిన డాక్టర్ భీమారావ్ అంబేద్కర్ 1956 డిసెంబర్ 6 న కన్నుమూశాడు. భారత రాజ్యాంగ శిల్పిగా, ప్రజాస్వామ్య పరిరక్షకునిగా, సంఘసంస్కర్తగా, మహామేధావిగా విఖ్యాతుడైన డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ స్మృతికి నివాళులర్పిస్తూ, ఆ మహనీయునికి ' భారతరత్న ' అవార్డును భారత ప్రభుత్వం ఇవ్వడం ద్వారా ఆ పురస్కారానికి ఒక ప్రతిష్ట ఏర్పడింది.



విశాల భారతి





డెకాయిట్ సినిమా విడుదలైన కొద్ది రోజుల్లోనే ప్రేక్షకుల్లో చర్చనీయాంశంగా మారింది. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన ఈ లవ్ అండ్ యాక్షన్ థ్రిల్లర్‌కు తొలిరోజు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ సాధించింది. ఈ సందర్భంగా చిత్ర బృందం సక్సెస్ మీట్ నిర్వహించింది.ఈ వేడుకకు నాగ్ అశ్విన్, నందిని రెడ్డి, అల్లు అరవింద్, బన్నీ వాసు, స్వప్న దత్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన అల్లు అరవింద్, హీరో అడివి శేష్‌పై ప్రశంసలు కురిపించారు. “శేష్ నిజంగానే ‘డెకాయిట్’ లాంటి వాడు. మంచి కథలను ఎంచుకుని ప్రేక్షకుల మనసులను దోచేస్తున్నాడు” అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. అలాగే నిర్మాత సుప్రియ యార్లగడ్డ ఈ సినిమా కోసం పడిన కష్టాన్ని ప్రత్యేకంగా గుర్తుచేశారు.సినిమా గురించి మాట్లాడుతూ, “లవ్ స్టోరీని క్రైమ్ కథతో మిళితం చేస్తూ చాలా అందంగా తీశారు. నేను చూసిన సినిమాల్లో ఇది ఒక బెస్ట్ మూవీగా అనిపించింది. డైరెక్టర్ షానిల్ డియో అద్భుతంగా తెరకెక్కించారు. ఎడిటింగ్ సినిమాకు ప్రత్యేక అందాన్ని తీసుకొచ్చింది” అని అన్నారు. ఎడిటర్ పవన్ కళ్యాణ్ పనిని కూడా ఆయన ప్రశంసించారు.ఇక హీరోయిన్ మృణాల్ ఠాకూర్ నటనపై అల్లు అరవింద్ ప్రశంసలు గుప్పించారు. “సీతారామం లో సీతగా అద్భుతంగా నటించింది. అయితే ‘డెకాయిట్’లో సరస్వతి పాత్రలో అంతకంటే మెరుగైన నటన చూపించింది. ఎమోషన్స్‌ను అద్భుతంగా పలికించింది” అని అన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.